ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

గురువారం 22 మే 2025





షర్మిలను శిబిరం నుంచి తరలిస్తున్న పోలీసులు

## ఉక్కులో డీజీఎం రాజీనామా

- కాంట్రాక్టు సిబ్బందిని తగ్గించాల్సిందిగా యాజమాన్యం ఒత్తిడి చేయడమే కారణం

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో మరో సీనియర్ అధికారి రాజీనామా చేశారు. యాజమాన్యం ఒత్తిళ్లు భరించలేకే ఆయన సర్వీస్ నుంచి వైదొలగారని ప్రచారం జరుగుతోంది. ఇటీవల యాజమాన్యం స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) ప్రకటించగా స్టీల్ మెల్టింగ్ షాప్ (ఎస్ఎంఎస్)లో డిప్యూటీ జనరల్ మేనేజర్ హోదాలో పనిచేస్తున్న ఓ అధికారి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆపరేషన్ల విభాగంలో ఆయన సేవలు అవసరమని యాజమాన్యం వీఆర్ఎస్ దరఖాస్తును తిరస్కరించింది. దాంతో ఆయన కొనసాగుతున్నారు. ఇటీవల ఆయన విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను భారీగా తగ్గించాలని యాజమాన్యం ఆదేశించింది. దానికి ... మిగతా 6వ పేజీలో



నగరంలో వర్షం

## ముసురు

- కొనసాగిన వర్షం
- ఎయిర్‌పోర్టులో 47 మి.మీ. నమోదు

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి భారీగా వస్తున్న తేమగాలుల ప్రభావంతో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ దఫదఫాలుగా నగరంలో వర్షం కురిసింది. ఎయిర్‌పోర్టు, సింహాచలం, గోపాలపట్నం, పెందుర్తి, తదితర ప్రాంతాల్లో భారీవర్షం పడింది. పలుచోట్ల రోడ్లపై నీరు చేరడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎయిర్‌పోర్టులో 47, బుచ్చిరాజుపాలెంలో 56.75, సింహాచలంలో 45.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## ఉక్కు పరిరక్షణకు ప్రాణ త్యాగానికైనా సిద్ధం



దీక్షలో షర్మిల

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

- తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విదుల్లోకి తీసుకోవాలంటూ ఆమరణ దీక్ష
- రాత్రి 9 గంటల సమయంలో భగ్నం చేసిన పోలీసులు...విమానాశ్రయానికి తరలింపు

వార్త మెయిన్ ఎడిషన్‌లో..

స్టీల్ ప్లాంటు పరిరక్షణ కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఉక్కు కర్మాగారంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆమె బుధవారం కూర్మన్నపాలెంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు.

# ఫ్లై ఓవర్లు అవసరం

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేల డిమాండ్

- నియోజకవర్గాల్లో ప్రతి అభివృద్ధి పనీ ఎమ్మెల్యేలకు చెప్పాకే చేపట్టాలి
- ఇకపై ప్రతి నెలా సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మంత్రి వెల్లడి
- సింహాచలం పంచ గ్రామాల సమస్య, అనకాపల్లి ల్యాండ్ పూలింగ్, బీచ్ కారిడార్ వంటి అంశాలపై త్వరలో కీలక నిర్ణయం



వీఎంఆర్‌డీఏలో బుధవారం మంత్రి నారాయణ నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జులు, అధికారులు

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి కావస్తున్నందున...కనెక్టివిటీ కోసం వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ రహదారులు నిర్మిస్తున్నదని, అయితే నగరంలో ట్రాఫిక్ రద్దీ తట్టుకోవడానికి ఫ్లైఓవర్లు కూడా అవసరమని ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. వీఎంఆర్‌డీఏలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ బుధవారం సమావేశం నిర్వహించగా, ఎమ్మెల్యేలంతా వారి వారి సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సూచనలు తెలియజేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ నుంచి భీమిలి వరకు బీచ్‌ను జోన్లుగా విభజించి వాటర్ స్పోర్ట్స్ ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా సింహాచలం బీఆర్‌టీఎస్ కారిడార్‌లో ఇళ్లస్థలాలు కోల్పోయిన వారికి ఇచ్చిన ... మిగతా 6వ పేజీలో

## కూటమిలో ఆధిపత్య పోరు

మంత్రి నారాయణ సమక్షంలో జనసేన, టీడీపీ నేతల మధ్య వాగ్వాదం

- జనసేన ఎమ్మెల్యేలు ఉన్నచోట తమ మాటకూ విలువ ఇవ్వాలని కోరిన
- టీడీపీ ఇన్‌చార్జులు ఎమ్మెల్యేదే తుది నిర్ణయమని స్పష్టం చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) కూటమిలోని టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బుధవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణ వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మిత్రపక్షాల మధ్య పెద్ద దుమారమే రేగింది. తొలుత టీడీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు/పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే (జనసేన) చెప్పిన పనులు మాత్రమే చేస్తున్నారని, పార్టీ ఇన్‌చార్జికి విలువ ఇవ్వడం లేదన్నారు. తమ సిఫారసులు కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేను 'నువ్వు' సంబోధించడంతో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ (జనసేన) జోక్యం చేసుకొని మర్యాదగా మాట్లాడాలని సూచించారు. అంతలో ఎలమంచిలి టీడీపీ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కల్పించుకొని తమ దగ్గర కూడా సమస్యలు ఉన్నాయని ప్రస్తావించారు. దీంతో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ, 'ఇది ఎమ్మెల్యేల సమావేశమా?, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జుల ... మిగతా 6వ పేజీలో

# 2.5 లక్షల మందితో యోగా డే

వచ్చే నెల 21వ తేదీ కార్యక్రమానికి ప్రధాన వేదికగా ఆర్కే బీచ్‌రోడ్డు



ఆర్కే బీచ్‌లో బుధవారం ఉదయం యోగాంధ్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, జాయింట్ కలెక్టర్ అశోక్ - వార్త 8వ పేజీలో

- ప్రధాని, గవర్నర్, ముఖ్యమంత్రి హాజరు
- భీమిలి వరకూ 500 కంపార్టుమెంట్లు
- ఒక్కొక్కచోట ఐదు వేల మంది...
- ప్రతి ఒక్కరికీ మ్యాట్లు, బనియన్లు పంపిణీ
- వర్షం వంటివి వస్తే ప్రత్యామ్నాయంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహణకు ఏర్పాట్లు

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 21వ తేదీ ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకూ విశాఖపట్నంలో నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవానికి ప్రధాన వేదికగా ఆర్కే బీచ్‌ను ఎంపిక చేశారు. బీచ్‌రోడ్డు, పక్కన ఇసుక తిన్నెల్లో 15 వేల మంది యోగా ప్రదర్శన చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విశ్వప్రియ ఫంక్షన్‌హాలుకు ఎదురుగా ప్రధాన వేదికను ఏర్పాటు చేయనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మరికొందరు ప్రముఖులు పాల్గొననున్నారు. ఒకవేళ బీచ్‌రోడ్డులో వర్షం వల్ల ఆటంకం ఎదురైతే.. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో కార్యక్రమం నిర్వహిస్తారు. అందుకోసం పది వేల మంది పాల్గొనేలా భారీ షెడ్లు వేస్తున్నారు.

పార్క్ హోటల్ జంక్షన్ నుంచి భీమిలి బీచ్ వరకూ యోగా ప్రదర్శనకు 500 కంపార్టుమెంట్లు గుర్తించారు. ప్రతి కంపార్టుమెంటులో ఐదువేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గీతం కళాశాల, గాయత్రి కళాశాల మైదానాలు కూడా కంపార్టుమెంట్లుగా గుర్తించారు. ఒక కంపార్టుమెంటుకు మరో కంపార్టుమెంటుకు మధ్య 100 మీటర్ల దూరం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. రెండున్నర లక్షల మంది పాల్గొననున్న యోగా ప్రదర్శనను సమన్వయం చేసుకునేందుకు 15 వేల మంది వలంటీర్లను నియమిస్తున్నారు. ప్రదర్శనలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ క్యూఆర్ కోడ్‌తో కూడిన హ్యాండ్ బ్యాండ్ ఇస్తారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల బృందం విశాఖ రానున్నది. ప్రదర్శనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయడానికి అనువుగా మ్యాట్, బనియన్లు కేంద్రం ... మిగతా 6వ పేజీలో

# మలేరియా పోస్టుల పందేరం!

431 మంది కార్మికుల నియామకానికి జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం ప్రతిపాదన

- ఆమోదం తెలిపిన కలెక్టర్
- ఎమ్మెల్యేలకు పదేసి, కార్పొరేటర్‌కు మూడేసి పోస్టులు పంచేస్తున్న అధికారులు
- పేర్లు ఇవ్వాలంటూ ఫోన్‌లు
- ఆ పోస్టులను కొందరు కార్పొరేటర్లు బేరానికి పెట్టారనే ఆరోపణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)లో మలేరియా కార్మికుల పోస్టుల పందేరం నడుస్తోంది. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు తాత్కాలిక ప్రాతిపదికన 431 మందిని నియమించుకునేందుకు ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ అనుమతిచ్చారు. అధికారులు ఆ పోస్టులను కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలకు వాటాలుగా పంచేస్తున్నారు. గతంలో ఉన్న కార్మికులను కొనసాగించాల్సి ఉన్నప్పటికీ డబ్బులు దండుకునేందుకే వారిని తొలగించి కొత్తగా నియామకాలు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**



వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు విజృంభిస్తుంటాయి. వాటికి అడ్డుకట్ట వేసేందుకుగాను దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడం, ఇళ్లలో దోమల లార్వాను గుర్తించి నాశనం చేయడం కోసం 431 మందిని తాత్కాలికంగా నియమించుకునేందుకు జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. ఏటా మాదిరిగానే సీజనల్ కార్మికులను నియమించుకోవడమేననే భావనతో ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆమోదం తెలిపారు. నెలకు రూ.15 వేలు చొప్పున చెల్లిస్తూ...ఐదు నెలలపాటు మాత్రమే వారిని పనిలో కొనసాగిస్తారు. 2018 నుంచి ఇదే మాదిరిగా సీజనల్ కార్మికుల సేవలను జీవీఎంసీ వినియోగించుకుంటోంది. ఏటా దాదాపు అదే సిబ్బంది పనిచేస్తుంటారు. ఎవరైనా అందుబాటులో లేకపోయినా, సీజనల్ కార్మికుడిగా పనిచేసేందుకు ఆసక్తిచూపకపోయినా వారిస్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తారు. ఈ నేపథ్యంలో గత ఏడాది పనిచేసిన కార్మికులనే తిరిగి విధుల్లోకి తీసుకుంటారని అంతా భావించారు. కానీ జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు మాత్రం కూటమి ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్ల మెప్పు పొందడం కోసం కొత్త ప్రతిపాదనను వారి ముందు పెట్టారు. పాత వారిని తిరిగి తీసుకోకుండా కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు సూచించిన వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. దీనికోసం ప్రతి కార్పొరేటర్‌కు ఫోన్ చేసి మలేరియా కార్మికుల భర్తీ కోసం మూడు పేర్లు ఇవ్వాలని, వారికే సీజనల్ పోస్టు ఇస్తామని చెబుతున్నారు. అలాగే ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి పదేసి పోస్టులు ... మిగతా 6వ పేజీలో

## ఉమ్మడి జిల్లాలో 93 హెచ్‌ఎం పోస్టులు ఖాళీ

బదిలీ కోసం దరఖాస్తుకు నేటి వరకూ గడువు

- ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో హెల్ప్‌డెస్క్

విశాఖపట్నం/ఆరిలోవ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ, మునిసిపల్, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో 93 గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు జిల్లా విద్యా శాఖ గుర్తించింది. ఒక పాఠశాలలో ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలో అటువంటి హెచ్‌ఎంలు 15 మంది ఉన్నారు. గత ఏడాదిగా 46 ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు పదవీ విరమణ చేయడంతో ప్రస్తుతం ఆ ఖాళీలను భర్తీచేస్తారు. జిల్లాలో 24 యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడంతో కొత్తగా 24 హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇటీవల భీమిలి డైట్‌కు లెక్చరర్లుగా ఇద్దరు హెచ్‌ఎంలు వెళ్లడంతో ఆ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అలాగే బాలికల పాఠశాలల్లోని హెచ్‌ఎంలు ఆరుగురు బదిలీ కానున్నారు. దీంతో మొత్తం ఉమ్మడి జిల్లాలో 93 హెచ్‌ఎం పోస్టులు బదిలీల కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన ... మిగతా 6వ పేజీలో

# రౌడీ షీటర్ల కదలికలపై నిఘా

గంజాయి రవాణాకు పూర్తిగా అడ్డుకట్టవేయాలి

- అధికారులకు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఆదేశం
- ఎవరైనా అవినీతికి పాల్పడినా, నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక




మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా పెట్టాలని అధికారులను పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఆదేశించారు. కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో సీఐ అంతకంటే పైస్థాయి అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రౌడీషీటర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై సంబంధిత స్టేషన్ సీఐలను ఆరా తీశారు. అలాగే ట్రాఫిక్, నేరపరిశోధన, శాంతి భద్రతల విభాగానికి సంబంధించిన కేసులను సమీక్షించారు. పెండింగ్ కేసులపై సంబంధిత దర్యాప్తు అధికారులను వివరణ అడిగారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. నగరంలో గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసుకోవాలని స్పష్టంచేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు, వాటిపై కేసులు నమోదుచేస్తున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. నగరంలోకి నేరస్థులు, సంఘవిద్రోహులు, ఉగ్రవాదులు ... మిగతా 6వ పేజీలో

## టీడీపీ ఫ్లోర్ లీడర్ పదవికి తీవ్ర పోటీ

- రేస్‌లో గంధం శ్రీనివాసరావు, గొలగాని మంగవేణి, పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల పంచాయితీ కొలిక్కివచ్చిందని ఊపిరి పీల్చుకుంటున్న తెలుగుదేశం పార్టీ నేతలకు ఇప్పుడు జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఎంపిక తలనొప్పిగా మారింది. ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న పీలా శ్రీనివాసరావు మేయర్ కావడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా పనిచేస్తున్న గంధం శ్రీనివాసరావుకు అవకాశం కల్పించాలని మేయర్‌తోపాటు కొందరు ఎమ్మెల్యేలు భావించారు. అయితే డిప్యూటీ మేయర్ పదవిని ఆశించిన కొందరు...కనీసం ఫ్లోర్‌లీడర్‌గా అయినా అవకాశం ఇవ్వాలని తమకు సన్నిహితంగా ఉండే ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. రెండుసార్లు కౌన్సిలర్‌గా, రెండుసార్లు కార్పొరేటర్‌గా పనిచేయడంతోపాటు డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న గంధం శ్రీనివాసరావు కూడా డిప్యూటీ మేయర్ పదవిపై భారీ ఆశలు పెట్టుకున్నారు. చివరకు ఆ పదవిని జనసేనకు కేటాయించడంతో మనస్థాపానికి గురయ్యారు. మేయర్, ఇతర ప్రజా ప్రతినిధులు బుజ్జగించడంతో మంగళవారం జరిగిన డిప్యూటీ మేయర్ ... మిగతా 6వ పేజీలో

## అప్రమత్తంగా ఉండండి : ఈఓఆర్‌డీ

పద్మనాభం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఈఓఆర్‌డీ మీనాకుమారి ఆదేశించారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో ఎక్కడా వర్షం నీరు నిల్వ లేకుండా, ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలను ముందుగా గుర్తించి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## 'పథకాలను సద్వినియోగం చేసుకోండి'

పద్మనాభం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో మహిళలకు ఉచితంగా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో ఎం. విజయ్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. అర్హులైన వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

## టెన్త్ విద్యార్థులకు అభినందనలు

తగరపువలస, మే 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన చిట్టివలస అంబేడ్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులను జనసేన నాయకులు బుధవారం అభినందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారి ఇళ్లకు వెళ్లి బొకేలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు జనసేన అధ్యక్షురాలు భువనేశ్వరి, పాఠశాల హెచ్‌ఎం జగన్నాథస్వామి, నాయకులు పి. తారకేశ్, ప్రభ, పాఠశాల కమిటీ సభ్యురాలు రూప పాల్గొన్నారు.

## రేషన్ వ్యాన్ల రద్దు హర్షణీయం

పద్మనాభం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : రేషన్ పంపిణీ వ్యాన్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని డీలర్ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు బసవాన శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెల నుంచి లబ్ధిదారులు డిపోలకు వెళ్లి రేషన్ తీసుకోవాలని చెప్పారు.

## పారిశుధ్య కార్మికులకు సబ్బులు పంపిణీ

కొమ్మాది, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. బుధవారం ఆమె 5వ వార్డు పబ్లిక్ హెల్త్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె డబ్బాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్డిపల్లి సచివాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పద్మనాభం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : రెడ్డిపల్లి సచివాలయాన్ని ఎంపీడీఓ ఎం. విజయ్ కుమార్ బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

## అంధ బాలికలకు పరికరాలు పంపిణీ

సాగర్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్న అంధులు ఎంతో గొప్పవారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి గంటా శారదా అన్నారు. అంధ బాలికల పాఠశాలకు ఓ సంస్థ వితరణగా అందజేసిన స్మార్ట్ ఫోన్, బ్రైలీ వాచ్, మొబిలిటీ స్టిక్, ఇయర్ బడ్స్, టాకింగ్ బిపి మిషన్, తదితర పరికరాలను విద్యార్థులకు బుధవారం ఆమె పంపిణీ చేశారు.

## కాలువలపై నిర్మాణాలు

సాగర్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు సుభాష్ నగర్‌లో కొందరు డ్రైనేజీలపై ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. దీనివల్ల పారిశుధ్య కార్మికులు కాలువల్లో పూడికలు తీసేటప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై పలువురు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

## 44 మందికి కళ్ల అద్దాలు అందజేత



కళ్ల అద్దాలు తీసుకున్న వారితో వైద్యులు

భీమునిపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నేత్ర వైద్య పరీక్షలు చేసుకున్న 44 మందికి బుధవారం కళ్ల అద్దాలు అందించారు. ఇటీవల ఆ సంస్థ ఆధ్వర్యంలో దిసన్ స్కూల్ ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే. శిబిరంలో 44 మందికి కళ్ల అద్దాలు అవసరమని వైద్యులు గుర్తించగా, సంస్థ నిర్వాహకులు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీడీ సంస్థ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్‌కుమార్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## సీపీఐ నేత అరుణ్‌కుమార్ మృతి పట్ల నివాళి

మధురవాడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పాతమధురవాడ మెట్టకు చెందిన సీపీఐ నాయకుడు కుడిపూడి అరుణ్‌కుమార్ (55) తన నివాసంలో అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన మధురవాడ జోన్ సీపీఐ కార్యదర్శిగా పని చేసేవారు. కుమార్ మృతదేహాన్ని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, నాయకులు వాండ్రాసి సత్యనారాయణ, వేలంగిణిరావు నివాళి అర్పించారు.

## అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, మే 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచరాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చనతో పూజలు చేశారు. మంగళ వాయిద్యాలు వెంట రాగా భక్తులు గరుడ వాహనంపై ఉన్న స్వామివారి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేశారు. తరువాత ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్లను ఉంచి నారసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు.

## రౌడీషీటర్ల కదలికలపై నిఘా

... 5వ పేజీ తరువాయి

చొరబడితే వెంటనే వారిని గుర్తించేందుకు వీలుగా విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్ (వీఎంఎస్)ను వినియోగించుకోవాలని సూచించారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, వేధింపులు, మిస్సింగ్ కేసుల నమోదు, దర్యాప్తులో జాప్యం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. వచ్చేనెల నిర్వహించే సమీక్షకు అధికారులు తమ పనితీరును మెరుగుపరచుకున్నట్టు నిరూపించుకోవాలన్నారు. పోలీసులు ఎవరైనా అవినీతికి పాల్పడినా, నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించినా, రౌడీషీటర్లు, నేరస్థులకు సహకరిస్తున్నట్టు తెలిసినా కఠినచర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.ఈ సమావేశంలో డీసీపీలు అజితావేజెండ్ల, మేరీప్రశాంతి, లతా మాధురి ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# పాడి పశువులకు బీమా.. రైతులకు ధీమా

- ప్రమాద సమయంలో పెంపకందారులకు ఆర్థిక భరోసా
- గ్రామాల్లో పశు వైద్యుల విస్తృత ప్రచారం



మజ్జివలసలో పాడి పశువుల మినీ డెయిరీ

భీమునిపట్నం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులకు ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించింది. పశు వైద్యాధికారులు దీనిపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీనివల్ల పశువులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రైతులు పరిహారం పొందే అవకాశం కలుగుతుంది. నియోజకవర్గంలోని భీమిలి మండలంలో భీమిలి, తాళ్లవలస, దాకమర్రి, ఆనందపురం మండలంలో శొంఠ్యాం, ఆనందపురం, పద్మనాభం మండలంలో పద్మనాభంలో ఉన్న పశువుల ఆస్పత్రుల ద్వారా రైతులు బీమా చేయిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, జబ్బులు, ఇతర కారణాల వల్ల పశువులు మృతి చెందితే రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుంది. ఈ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరమని అధికారులు చెబుతున్నారు.

### బీమా చేయించుకునే విధానం

- పశువులు కొనుగోలు చేసిన సమయంలోనే రైతులు బీమా చేయించాలి. ఈ బీమాను పశువైద్యశాఖాధికారుల ద్వారా చేయించాలి. వారి వద్ద దరఖాస్తులు అందుబాటులోనే ఉంటాయి.
- బీమా చేసిన పాడి పశువు చనిపోతే గరిష్ఠంగా రూ 75 వేలు వరకూ పరిహారం లభిస్తుంది. ఒకే వ్యక్తి రెండు పశువులకు ఒకే బీమా చేయించవచ్చు.రెండూ ఒకే ప్రమాదంలో చనిపోతే ఒకే ప్రీమియంలో రెండింటికి రూ1.50 లక్షల వరకు పరిహారాన్ని పొందవచ్చు.
- బీమా చేసిన వెంటనే పశువు చెవికి పోగు వేస్తారు. దానికి కోడ్ నంబరు ఉంటుంది. ఆ కోడ్ నంబరు అధికారుల వద్ద ఉంచుకుంటారు. పశువు చనిపోయిన వెంటనే రైతు ఆవిషయాన్ని అధికారులకు తెలియజేయాలి. పోస్టుమార్టం రిపోర్టు, ఆ రింగు ఆధారంగా పరిహారాన్ని రైతులకు అందజేస్తారు
- పశువు చనిపోయిన 24 గంటల్లోనే ఈ విషయాన్ని పశుసంవర్థకశాఖ అధికారులకు బీమా అధికారులకు పశువుల బీమా పథకం నోడల్ అధికారికి తెలియజేయాలి. వారి పరిశీలన అనంతరం పరిహారం కోసం సిఫార్సు చేస్తారు. కాగా రూ.10,000 పశువు విలువ అయితే బీమా రూ.275.00 చెల్లించాలి. అలాగే రూ. 15,000 అయితే రూ.412, రూ.30,000 అయితే రూ. 825.00 ప్రీమియం చెల్లించాలని ఆయన చెప్పారు.

## ప్రకృతి పాఠశాలలో పుస్తకాల స్టాక్ పాయింట్

భీమునిపట్నం (రూరల్), మే 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించే స్టాక్ పాయింట్‌ను తగరపువలస, భీమిలి రహదారి మధ్యలో ఉన్న ప్రకృతి పాఠశాలలో ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన అచ్చు, నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. ఈమేరకు సామగ్రిని ఇక్కడి ప్రత్యేక గదుల్లో భద్రపరిచారు. ఇప్పటికే జిల్లా అధికారులు రెండుసార్లు కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే జూన్ 12 నాటికి పుస్తకాలను విద్యార్థులకు అందించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏర్పాట్లు చేసినట్టు ఎంఈఓ శివరాణి తెలిపారు. పాఠశాలల పునః ప్రారంభం అనంతరం పుస్తకాలు అందిస్తామని చెప్పారు.

## సింహాచలం దేవస్థానంలో.. బదిలీల గుబులు

### - 20 మందికి స్థాన చలనం ?

సింహాచలం, మే 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పని చేసే సిబ్బందిలో బదిలీల గుబులు మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విభాగాల్లో పని చేసే వారిలో ఐదేళ్ల పాటు ఒకేచోట ఉన్నవారిని బదిలీ చేయాలని మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈమేరకు దేవస్థానంలోని పలు విభాగాల్లో పదిహేను మంది ఐదేళ్లకు మించి విధులు నిర్వహిస్తున్న వారు ఉన్నట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. గత రెండేళ్లలో కొందరు నగరంలోని కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం నుంచి సింహాచలం దేవస్థానానికి, అటు నుంచి ఇటు బదిలీలు జరిపించుకున్నారు. వారి బదిలీలు నిబంధనలకు వ్యతిరేకమని తాజాగా ఒక ఉద్యోగి దేవదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందిస్తూ 18 కిలోమీటర్ల దూరంలోని రెండు దేవస్థానాల నడుమ బదిలీలు చెల్లవని చెప్పి, బదిలీలు పొందిన వారి జాబితాను పంపాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. మొత్తమ్మీద దేవస్థానంలో కనీసం 20 మందికి కంటే ఎక్కువ మందికి బదిలీలు అయ్యే అవకాశం ఉందని అధికారులు చర్చించుకుంటున్నారు.

## రిటైర్డు అధ్యాపకుడికి పూర్వ విద్యార్థుల సన్మానం



వెంకటాచారిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పద్మనాభం, మే 21 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం మండలానికి సమీపంలో ఉన్న బాకురుపాలెంలో పూర్వ విద్యార్థులు తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువును బుధవారం ఘనంగా సన్మానించారు. పద్మనాభంలోని రెండో విజయరామరాజు కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా సేవలందించిన అద్దాల వెంకటాచారిని పూర్వ విద్యార్థులు పూలమాల వేసి, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎంఆర్ జోగినాయుడు, పి. శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు రామకృష్ణ, నాగరాజు, కృష్ణ, అప్పన్న పాల్గొన్నారు.

## సమస్యలపై వీఆర్‌ఓల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆనందపురం, మే 21 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాలను క్లస్టర్లగా విభజించడం వల్ల వీఆర్‌ఓలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌కు మండలంలోని వీఆర్‌ఓలు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా విభజించి, ఒక సచివాలయం వీఆర్‌ఓకు, రెండవ సచివాలయం సర్వేయర్‌కు కేటాయించేలా ఆదేశాలు జారీ చేశారని, దీనివల్ల రాష్ట్రంలోని 7500 మంది వీఆర్‌ఓలను వారు పని చేస్తున్న సచివాలయంలో చూపించకుండా మిగులు సిబ్బందిగా చూపిస్తున్నారని తెలిపారు. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. కస్టర్ విధానం భవిష్యత్‌లో మరిన్ని సమస్యలకు దారి తీస్తుందన్నారు.

## రెండో రోజూ కొనసాగిన హనుమత్ జయంతి పూజలు

సింహాచలం, మే 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయంగా మెట్ల మార్గంలో ఉన్న సాక్షి ఆంజనేయ దేవాలయంలో హనుమ జయంత్యుత్సవాల్లో భాగంగా బుధవారం కూడా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు అనంతరం పంచామృతాభిషేకాలను శాస్త్రరీతిలో నిర్వహించారు. ఏడు గంటల నుంచి నాలుగు గంటల పాటు శ్రీమద్రామాయణంలోని సుందరకాండ సర్గను అధ్యాపకులు పారాయణం చేశారు.

**భీమునిపట్నం :** పట్టణంలోని సీతారామ లక్ష్మణ సహిత దాస ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమత్ జయంతి నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు చెన్నకృష్ణమాచార్యులు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి అష్టోత్తర శత నారికేళములతో స్వామివారికి పంచామృత, ఫలరస, సుగంధజల అభిషేకాలు, సింధూరార్చనలు, సహస్రనామ పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం శ్రీరామ నామ సంకీర్తనలు, హనుమాన్ చాలీసా, ఆరు గంటలకు హనుమత్ వైభవం పురాణ ప్రవచనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## ఫ్లై ఓవర్లు అవసరం

... 5వ పేజీ తరువాయి

టీడీఆర్‌లు ఆన్‌లైన్‌లో విక్రయించుకునే అవకాశం కల్పించాలన్నారు. అధికారులు ఏమైనా అభివృద్ధి పనులు ప్రతిపాదించినప్పుడు వాటిని ముందుగా ఎమ్మెల్యేలకు తెలియజేయాలని చెప్పగా, స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమర్థించారు. నాయకులు వారి పార్టీ మైలేజీ కోసం వాటిని ప్రచారం చేసుకుంటారని, ప్రజలకు చేరువుగా తీసుకువెళతారని, ఇరు వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయానికి వెళ్లాలంటే రెండు గంటల సమయం పడుతుందని, ట్రాఫిక్ సమస్య తీరేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. మారియట్ హోటల్ వద్ద ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇచ్చారని, స్థలానికి టీడీఆర్‌లు ఇవ్వాలని కోరారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రహదారుల నిర్మాణాలపై మాట్లాడారు. మరికొందరు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ వాటర్ పైపులైన్లు త్వరగా పూర్తిచేయాలని, ఎక్కడికక్కడ నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని కోరారు. కొండవాలు ప్రాంతాల్లో వ్యర్థాలను తరలించే వాహనాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. పేదల వద్ద 2014లో డీడీలు కట్టించుకున్నామని, వారికి ఇళ్లు అప్పగించాలని మరో ఎమ్మెల్యే కోరారు.

మంత్రి నారాయణ మాట్లాడుతూ, సింహాచలం పంచ గ్రామాల సమస్య, అనకాపల్లి ల్యాండ్ పూలింగ్, బీచ్ కారిడార్ వంటి అంశాలపై త్వరలోనే కీలక నిర్ణయాలు వస్తాయన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఇకపై ప్రతినెలా సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేశ్ బాబు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాస్, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, విజయనగరం కలెక్టర్ అంబేద్కర్, అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, పురపాలక శాఖ కమిషనర్ సంపత్‌కుమార్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కృష్ణాకాలనీలో ఉన్న సబ్‌స్టేషన్ మరమ్మతు, 11 కేవీ పాలిటెక్నిక్ కళాశాల ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భీమిలి, నేరెళ్లవలస, జేవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, కుమ్మరిపాలెం,తోటవీధి, అప్పికొండవీధి, జగనన్నకాలనీ,బ్యాంక్ కాలనీ, స్మిత్ స్ట్రీట్, రేఖవానిపాలెం, మూలకుద్దు, రాయపాలెం, మహాలక్ష్మీ పురం ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. అలాగే కాపులుప్పాడ 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ రామాద్రి, మంగమారిపేట, తిమ్మాపురం, కాపుల దిబ్బడిపాలెం, కె.నగరపాలెం, రెడ్డీలపాలెం, సోమన్నపాలెం, కళాగ్రామం, గ్రేహౌండ్స్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### ఆనందపురంలో...

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతు దృష్ట్యా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ ఎం. అప్పలనాయుడు తెలిపారు. ఆనందపురం, చందక, పొడుగుపాలెం, గొట్టిపల్లి, ఏనుగుపాలెం, సుఖీభవ లేఅవుట్ ప్రాంతాలకు సరఫరా ఉండదని,వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

### పద్మనాభంలో...

పద్మనాభం : పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపల్లి, పాండ్రంగి 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శేరిఖండం, రెడ్డిపల్లి, పొట్నూరు, తునివలస, నర్సాపురం చిన్నాపురం, కొయ్యపేట, నేరేళ్లవలస, పాండ్రంగి, మునివానిపేట, సామయ్యవలస గ్రామాలకు సరఫరా నిలిపి వేస్తామన్నారు.

## మంత్రి నారాయణ దృష్టికి టీడీఆర్ సమస్య

సింహాచలం, మే 21 (ఆంధ్రజ్యోతి) :పాతగోశాల కూడలి నుంచి పాత అడివివరం కూడలి వరకు ఉన్న బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్వాసితుల టీడీఆర్ సమస్యను కార్పొరేటర్ నరసింహం, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. నగర పర్యటనకు వచ్చిన మంత్రిని బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత వైసీపీ పాలనలో రాత్రికి రాత్రి రోడ్డు నిర్మాణం ప్రారంభించి, ఆ ప్రాంతంలోని ప్రజలను పోలీసుల సహకారంతో దౌర్జన్యంగా ఖాళీ చేయించిన విషయాన్ని మంత్రికి వివరించారు. 18 నెలల క్రితం రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇచ్చినప్పటికీ అవి నిరుపయోగంగా మిగిలిపోయాయని చెప్పారు. టీడీఆర్‌లకు సేల్ ఆప్షన్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

## ఐజీసీఎస్‌ఈ పరీక్షా ఫలితాల్లో ఓక్రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ





భీమునిపట్నం (రూరల్), మే 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన ఇంటర్నేషనల్ జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (ఐజీసీఎస్‌ఈ) పరీక్షా ఫలితాల్లో సింగనబంద ఓక్రిడ్జ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థి జుబెయిన్ హష్మీ ఎనిమిది సబ్జెక్టుల్లో అగ్ర స్థానంలో నిలిచి అన్నింటిలోనూ ఏ గ్రేడు సాధించారని ప్రిన్సిపాల్ శైలా భమిడిపాడి తెలిపారు. అలాగే అన్య వీరమాచనేని ఆరు సబ్జెక్టుల్లో ఏ గ్రేడు సాధించి, రెండో స్థానంలో నిలిచినట్టు చెప్పారు.

## నారాయణరావు మాస్టారు మృతి పట్ల సంతాపం

పద్మనాభం, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి శాంతినికేతన్ పాఠశాల వ్యవస్థాపకుడు సూరకాశి నారాయణరావు మాస్టారు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. 1979లో స్థాపించబడి 1990 దశకంలో ఉత్తరాంధ్రలోనే ఆయన నెలకొల్పిన శాంతినికేతన్ విద్యా సంస్థ ప్రఖ్యాతిగాంచింది. వేలాది మంది విద్యార్థులు ఆయన వద్ద చదివారు. ఒకవైపు విద్యా రంగంలో పని చేస్తూనే ఆయన క్రియాశీల రాజకీయాల్లోనూ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో పలు బాధ్యతలు చేపట్టారు. పీసీసీ సభ్యుడిగా చాలా కాలం పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు నాయకులు, ఉద్యోగులు సంతాపం తెలిపారు.

## 'రైతుబజారు ప్రారంభోత్సవానికి ఆహ్వానం లేదు'

తగరపువలస, మే 21 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలో ఏర్పాటు చేసిన రైతుబజారు ప్రారంభోత్సవానికి తనకు ఆహ్వానం లేదని టీడీపీ రెండో వార్డు అధ్యక్షుడు బడిగంటి నీలకంఠం ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి వార్డులో ప్రధాన వ్యక్తిగా ఉన్న తనకు ఎటువంటి సమాచారం అందించలేదన్నారు. ఎమ్మెల్యే గంటా పాల్గొన్న కార్యక్రమాలకు తనకు సమాచారం లేకపోతే ఎలా అని ప్రశ్నించారు.

## కూటమిలో ఆధిపత్య పోరు

... 5వ పేజీ తరువాయి

సమావేశమా?, అలాగైతే కూటమిలోని అన్ని పార్టీల ఇన్‌చార్జులను కూడా సమావేశానికి ఆహ్వానించాలి కదా?, ఒక్క టీడీపీ వారినే పిలవడం ఏమిటి?' అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ, ఎలమంచిలిలో '50 శాతం ఎమ్మెల్యే' తానేనంటూ ప్రగడ నాగేశ్వరరావు అధికారులను తన వద్దకు రావాలని బెదిరిస్తున్నారని, ఆయన ప్రతిపాదించిన అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారని...ఇలా '50 శాతం ఎమ్మెల్యే'లు ఎక్కడైనా ఉంటారా? అని ప్రశ్నించారు. ఈ దశలో గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులైన పల్లా శ్రీనివాసరావు కల్పించుకొని చేసిన సేవలను గుర్తించి కొందరికి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించామని, వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే మరికొందరికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామని, వారు ఏదైనా అంశంపై సలహాలు మాత్రం ఇవ్వవచ్చునన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాటే చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర నాయకుడిగా పల్లా శ్రీనివాసరావు స్పష్టత ఇవ్వడంతో ఆయా నియోజకవర్గాల్లో ఇకపై విభేదాలు తగ్గుతాయని భావిస్తున్నారు.

## 2.5 లక్షల మందితో యోగా డే

... 5వ పేజీ తరువాయి

సరఫరా చేస్తోంది. యోగా ప్రదర్శనకు నగరంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి సాధకులను సమీకరిస్తున్నారు. నగరం, పరిసర ప్రాంతాల నుంచి ప్రదర్శన ప్రాంతాలకు తీసుకురావడానికి వాహనాలు సమకూరుస్తారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాలు గుర్తించారు. ప్రదర్శన అనంతరం ప్రతి ఒక్కరికీ స్నాక్స్, మంచినీరు అందిస్తారు.

### ప్రధాని కోసం ఏయూలో హెలిప్యాడ్లు

వచ్చే నెల 20వ తేదీ సాయంత్రం నగరానికి రానున్న ప్రధాని ఆరోజు రాత్రి ఐఎన్‌ఎస్ చోళాలో బస చేస్తారు. ఆ మరుసటిరోజు ఉదయం ఆరు గంటలకు హెలికాప్టర్‌లో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ల్యాండ్ అవుతారు. ఐఎన్‌ఎస్ చోళా నుంచి మూడు హెలికాప్టర్లు ఒకేసారి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుంటాయి. హెలికాప్టర్లు ఢిల్లీ నుంచి రానున్నాయి. ఏయూలో హెలిప్యాడ్ నుంచి ప్రధాని బీచ్‌రోడ్డుకు చేరుకుంటారు. కాగా ఆర్కే బీచ్‌లో ప్రధాని పాల్గొనే వేదికకు ఎదురుగా సముద్రంలో తూర్పు నౌకా దళానికి చెందిన ఒక యుద్ధ నౌకలో యోగా ప్రదర్శన నిర్వహిస్తారు.

## మలేరియా పోస్టుల పందేరం!

... 5వ పేజీ తరువాయి

కేటాయిస్తున్నట్టు చెబుతున్నారు. దీనివల్ల పాతవారికి అవకాశం లేకుండా పోవడంతోపాటు కొత్తగా తీసుకునే వారి నుంచి డబ్బులు వసూలు చేసేందుకు వీలు కల్పించినట్టవుతుంది. ఇదే అదనుగా కొంతమంది కార్పొరేటర్లు మలేరియా కార్మికుడి పోస్టు ఇప్పిస్తామంటూ ఆశావహుల నుంచి అవకాశం ఉన్నంతమేర వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయమై ఇటీవల డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా కొంత మంది కార్పొరేటర్ల మధ్య చర్చ జరిగింది. పాతవారిని తొలగించడం సరికాదని కొందరు అభిప్రాయపడితే, మరికొందరు వైసీపీ పాలకవర్గం ఉన్నప్పుడు వారు డబ్బు తీసుకునే పోస్టులు ఇచ్చారు ఇప్పుడు మనం కూడా అలా చేయడంలో తప్పేముందని వాదించారు.

## ఉక్కులో డీజీఎం రాజీనామా

... 5వ పేజీ తరువాయి

ఆయన అంగీకరించలేదు.వారిని తగ్గిస్తే ఆ విభాగంలో అనుకున్న పనులు జరగవని, లక్ష్యం సాధించలేమని యాజమాన్యానికి తెలియజేశారు. కాంట్రాక్టు కార్మికులను తగ్గించకపోతే, రాజీనామా చేసి వెళ్లిపోవాలని యాజమాన్యం పేర్కొనడంతో ఆయన వెంటనే రాజీనామా చేసేశారని తెలిసింది. కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్న యాజమాన్యం బాగా పనిచేసే అధికారులను సైతం తొలగించడం అన్యాయమని ఉద్యోగ వర్గాలు విమర్శిస్తున్నాయి.

## టీడీపీ ఫ్లోర్ లీడర్ పదవికి తీవ్ర పోటీ

... 5వ పేజీ తరువాయి

ఎన్నికకు హాజరయ్యారు. మరోవైపు డిప్యూటీ మేయర్ పదవి కోసం చివరి వరకూ పోటీపడిన గొలగాని మంగవేణి, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు కూడా ఫ్లోర్ లీడర్ పదవిని ఆశిస్తున్నారు. ఎవరికి అవకాశం దక్కుతుందో చూడాలి.

## ఉమ్మడి జిల్లాలో 93 హెచ్‌ఎం పోస్టులు ఖాళీ

... 5వ పేజీ తరువాయి

ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేకపోతే కేటగిరీ-4లో ఉన్న పోస్టులకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. బదిలీలకు గురువారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బదిలీల దరఖాస్తు చేసే సమయంలో సందేహాల నివృత్తికి సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రోజూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హెల్ప్ డెస్క్ పనిచేస్తుందని చెప్పారు.

## పాండ్రంగిలో గోస్తనీ నదిపై వంతెన నిర్మాణం

పద్మనాభం, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి గ్రామంలో వంతెన నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభమైంది. ఈ గ్రామంలో రూ.14 కోట్లతో గోస్తనీ నదిపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిన విషయం విదితమే. ఈమేరకు నదిలో పిల్లర్ల పనులు జరుగుతున్నాయి.కొన్ని దశాబ్దాల కలగా ఉన్న ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఈ మార్గంలో ప్రయాణించే వారికి చాలా ఇబ్బందులు తీరుతాయి.

# మార్కెట్ యార్డుకు మోక్షం లేదా!

ఏళ్ల తరబడి సముదాయం ఖాళీగా ఉన్నా పట్టించుకునే నాథులే కరువాయె..

- 61 షాపుల్లో కేవలం ఆరు దుకాణాల్లోనే చేపల విక్రయం
- రహదారులపై యథేచ్ఛగా చిరు వ్యాపారుల కార్యకలాపాలు
- తరచూ ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు
- ఇటీవల 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా'లో రోడ్ల పక్కన వ్యాపారాలను తొలగించాలని కోరిన స్థానికులు
- ఇప్పటికీ స్పందించని అధికారులు



మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న దుకాణాలు



కూర్మన్నపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) 87వ వార్డు పరిధి వడ్లపూడి ఈ-సేవా కేంద్రం వద్ద లక్షలాది రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డు సముదాయం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. 86, 87 వార్డుల ప్రజల సౌకర్యార్థం 2014లో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు లక్షలాది రూపాయలతో 61 షాపులను ఇక్కడి సముదాయంలో నిర్మించారు. ఆ సమయంలోనే ఈ షాపులను 61 మంది స్థానిక చిల్లర వ్యాపారులకు, రైతులకు కేటాయించారు. అయితే కొద్ది రోజులు మాత్రమే ఇక్కడకు రైతులు వచ్చి వ్యాపారాలను కొనసాగించారు. కాలక్రమేణ షాపులను ఖాళీ చేసి మళ్లీ రోడ్ల పక్కనే ఆశీలును చెల్లిస్తూ వ్యాపారాలు సాగిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్ యార్డు సముదాయంలో కేవలం ఆరు షాపుల్లో మాత్రమే చేపలను విక్రయిస్తున్నారు. మిగతా దుకాణాలన్నీ ఖాళీగానే ఉన్నాయి. కాగా రహదారుల పక్కన స్థలాలను పలువురు ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేసి నెలకు రూ.ఐదు వేల నుంచి రూ.15 వరకు అద్దెకు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్ల పక్కన వ్యాపార కలాపాలను సాగిస్తుండడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల పక్కన దుకాణాలను తొలగించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం శూన్యమని వాపోతున్నారు. ఈ క్రమంలో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' పేరిట నిర్వహించిన కార్యక్రమంలోనూ వడ్లపూడిలో రోడ్లపై ఆక్రమణలను తొలగించాలని, మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న షాపులను వారికి కేటాయించాలటూ అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. అయినా ఇప్పటివరకు వారు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

## టోల్‌గేటును పునఃప్రారంభిస్తే ఊరుకోం

ఆందోళనలకు దిగుతామంటున్న టీడీపీ నాయకులు

అగనంపూడి, మే 21 (ఆంధ్రజ్యోతి): మూతబడిన అగనంపూడి టోల్‌గేటును పునఃప్రారంభిస్తే పోరాటాలు, ఆందోళనలు తప్పవని తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. టోల్‌గేటు వద్ద రహదారికి మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో టోల్ బూత్‌ను పునఃప్రారంభిస్తారనే ప్రచారం జరుగుతుంది. ఈ క్రమంలో బుధవారం టీడీపీ నాయకులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఆర్థిక భారం కలిగిస్తున్న ఈ టోల్‌గేటును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో తొలగించారన్నారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు మళ్లీ దీనిని పునఃప్రారంభించాలని చూస్తే సహించేంది లేదని హెచ్చరించారు. నాయకులు కొర్రాయి జగదీశ్, బి.సత్యనారాయణ, బి.చందూరమేశ్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

## అగనంపూడి పరిసరాల్లో భారీ వర్షం

అగనంపూడి, మే 21: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత ప్రాంతాలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీల పరిసరాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నుంచి వర్షపు నీరు పారింది. గత కొన్ని రోజులుగా మండుతున్న ఎండలతో విలవిల్లాడిన ప్రజలు ఈ వర్షంతో సేదతీరారు. చెరువుల్లో కొంతమేర నీరు చేరింది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజానీకానికి చల్లబడిన వాతావరణంతో కాస్త ఊరట లభించింది. ఇదిలావుండగా నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో వర్షానికి మురుగు నీరంతా రహదారులపైకి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా వారపు సంతకు కొనుగోలుదారుల రాకపోవడంతో దుకాణాలు వెలవెలబోయాయి.

## చిన్నారులకు క్రీడా సామగ్రి పంపిణీ

విశాఖపట్నం-స్పోర్ట్సు, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్ బుధవారం సందర్శించారు. ఇందులో భాగంగా గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాలోల జరుగుతున్న శిక్షణ కేంద్రాలకు వెళ్లి అక్కడి చిన్నారులకు బాక్సింగ్ క్రీడా సామగ్రితో పాటు కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, హాకీ, కరాటే, బాస్కెట్‌బాల్, తైక్వాండో క్రీడలకు చెందిన సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్‌వీఎస్ఎన్ రాజు, డీఈఈ అప్పారావు, డీఎస్ఏ కోచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రైళ్ల రీ షెడ్యూల్

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో బుధవారం మరికొన్ని రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో ఆలస్యంగా నడిచాయి. సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరాల్సిన విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (58532) రాత్రి 9.15 గంటలకు, మధ్యాహ్నం 3.35 గంటలకు బయలుదేరాల్సిన విశాఖ-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (22854) అర్థరాత్రి 12 (తెల్లవారితే 22వ తేదీ), గురువారం ఉదయం 8.25 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) ఉదయం 10.40కు, ఉదయం 10.40 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-ఎస్ఎంవీ బెంగళూరు దురంతో ఎక్స్‌ప్రెస్ (12245) మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశారు.

## 'నిర్వాసిత ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించాలి'

పెదగంట్యాడ, మే 21(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 28న జరగనున్న మత్స్యకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో గంగవరం పోర్టు నిర్వాసిత ఉద్యోగుల సమస్యలను చర్చించాలని సంఘం విజ్ఞప్తి చేసింది. బుధవారం గంగవరంలో జరిగిన సమావేశంలో విజయవాడలో జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశానికి సుమారు 40మంది పోర్టు నిర్వాసిత ఉద్యోగుల సంఘం నాయకులు హాజరవ్వాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫిషింగ్ జెట్టీని నిర్మించాలని, దాని నిర్మాణం పూర్తయ్యేంత వరకు మత్స్యకారులకు నెలకు రూ.3 వేల చొప్పున జీవన భృతి చెల్లించాలని, నిర్వాసిత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీ మొత్తాన్ని ఇవ్వాలని, తదితర సమస్యలను రౌండ్‌టేబుల్ సమావేశం ముందుంచాలని సంఘం నాయకులు తీర్మానించారు. సమావేశంలో సంఘం నాయకులు గింటిపిల్లి అమ్మోరు, నొల్లి తాతారావు, కదిరి సత్యారావు, స్వామి, సోమరాజు, తదితులు పాల్గొన్నారు.

## విధులకు 70 శాతం మంది కాంట్రాక్టు కార్మికుల హాజరు

- 2వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మే 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చినప్పటికీ చాలామంది కాంట్రాక్టు కార్మికులు హాజరవుతున్నారు. మంగళవారం సుమారు 70 శాతం మంది విధులకు హాజరవ్వగా.. రెండో రోజైనా బుధవారం కూడా అదే సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు విధులకు వెళ్లారు. కాగా కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె నేపథ్యంలో ప్లాంటులో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఉత్పత్తి విభాగాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

### యాజమాన్యం భయభ్రాంతులకు గురిచేస్తుంది: కార్మిక నాయకులు

కార్మిక వర్గాన్ని ఉక్కు యాజమాన్యం భయపెట్టాలని చూస్తుందని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు పేర్కొంటున్నారు. ప్లాంట్ ప్రధాన గేటు ముందు బుధవారం పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ గడిచిన 30 ఏళ్లగా ప్లాంటు కోసం సర్వం త్యాగం చేసిన కార్మికులను ఇప్పుడు ఒక్కసారిగా తొలగించే ప్రయత్నాలు జరుగుతుండడం దారుణమన్నారు. ప్లాంటులో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీస్ బలగాలను మోహరించారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తా మన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, రమణ, సొంబాబు, అప్పారావు, వంశీ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



పాత గాజువాకలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెర్రిపోతుల ముత్యాలు

## రాజీవ్‌గాంధీకి నివాళి

గాజువాక, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు సంక్షేమాన్ని అందించిన ఘనత దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని ఏపీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. రాజీవ్‌గాంధీ వర్థంతిని పురస్కరించుకుని మంగళవారం పాత గాజువాకలో గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆనందంగా ఉండాలనే లక్ష్యంతోనే రాజీవ్‌గాంధీ పాలన సాగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు భూలోక, సూరిబాబు, వర్మ, రాజుబాబు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు గవర వెంకటరమణ ఆధ్వర్యంలో రాజీవ్ వర్థంతిని జరిపారు.

**పెదగంట్యాడ:** నడుపూరు రాజీవ్ కూడలిలో దివంగత రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఏపీసీసీ అధికార ప్రతినిధి జె.ముత్యాలు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు భూలోక, ఎంఎస్ వర్మ, కె.చిన్నారావు, రాజబాబు, కె.అప్పారావు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన సిగరెట్లు స్వాధీనం

గాజువాక, మే 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన సిగరెట్లను గాజువాక పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కణితి రోడ్డు జగ్గు జంక్షన్ వద్ద చంద్రమౌళి షాపులో నందు పోలీసులు దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన సిగరెట్లను గుర్తించారు. వీటిపై ఎటువంటి సింబల్స్ కానీ ఆరోగ్యానికి హానికరమనే లేబుళ్లు గానీ లేవని పోలీసులు తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకుని షాపు యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

## సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 18, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 32, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 16, క్యారెట్ 38 దొండకాయలు 18, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది) 50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, గోరుచిక్కుడు 36, దేముడుచిక్కుడు 64, కూరపెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, బూడిద గుమ్మడికాయ 20, జామకాయలు (కిలో) 80.

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 545 |
| విజయనగరం | 549 |
| శ్రీకాకుళం | 549 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 105 |
| లైవ్ ధర | 125 |
| విత్ స్కిన్ | 220 |
| స్కిన్‌లెస్ | 230 |

## షర్మిల ఆమరణ నిరాహార దీక్షకు కాంగ్రెస్ నాయకుల దూరం

గాజువాక, మే 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు నిరసనగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు పారిశ్రామిక ప్రాంత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దూరంగా ఉన్నారు. షర్మిల ఆమరణ నిరాహార దీక్షకు దిగుతున్న సమాచారం స్థానిక నాయకులకు తెలియజేయకపోవడం, క్యాడర్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. గతంలో దీక్షలో పాల్గొనేందుకు షర్మిల వచ్చినప్పుడు పారిశ్రామిక ప్రాంత నాయకులు, కార్యకర్తలు హాజరై ఆమెకు స్వాగతం పలికి మద్దతుగా నిలిచారు. ఆ సమయంలో కూడా స్థానిక క్యాడర్‌ను ఆమె సరిగ్గా పట్టించుకోకపోవడంతో అప్పట్లోనే వారంతా ఆవేదనకు గురయ్యారు. దీంతో బుధవారం షర్మిల వస్తున్న విషయం తెలిసినప్పటికీ వారు ఆమెను కలవకుండా దూరంగా ఉన్నారు.

## శిథిల భవనాలను తొలగించాలి

అగనంపూడి, మే 21 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి కూడలికి సమీపంలో ఉన్న శిథిలమైన పాత పంచాయతీ భవనాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. శిథిలమైన ఈ భవనాలు ఆకతాయిలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఏరియా ఆస్పత్రికి అనుకొని ఉన్న ఈ శిథిల భవనాలను తక్షణమే తొలగించి పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. పార్కు అభివృద్ధి చేస్తే అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జీవీఎంసీ అధికారులు చొరవ తీసుకొని తక్షణమే శిథిలమైన ఈభవనాలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## టీడీపీ 87వ వార్డు అధ్యక్షుడిగా విజయరామరాజు



కూర్మన్నపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 87వ వార్డు అధ్యక్షుడిగా కణితికి చెందిన ఎస్ఎస్ విజయరామరాజు నియమితులయ్యారు. టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో ఆయనను ఎన్నుకున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జిగా సూరిశెట్టి పెంటారావు, ఉపాధ్యక్షుడిగా ప్రగడ దానయ్య, ప్రధాన కార్యదర్శిగా బొట్టా ప్రకాశ్, కోశాధికారిగా ఎం.రాముతో పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని బుధవారం టీడీపీ అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ తనకు బాధ్యతలను అప్పగించిన పల్లా శ్రీనివాసరావుకు, బొండా జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## 24న ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

అగనంపూడి, మే 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఈ నెల 24వ తేదీన ఇక్కడి ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దాతల నుంచి రక్తాన్ని సేకరించడం జరుగుతుందన్నారు. అందువల్ల ఆరోగ్యవంతులందరూ రక్త దానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి అండగా నిలవాలని ఆమె కోరారు.



షర్మిలకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు

## షర్మిలకు స్వాగతం

గోపాలపట్నం, మే 21(ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు చేపడుతున్న దీక్షకు సంఘీభావం తెలపడానికి నగరానికి వచ్చిన రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు విమానాశ్రయంలో కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. బుధవారం మధ్యాహ్నం 12.45 గంటలకు హైదరాబాద్ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన స్టీల్‌ప్లాంట్‌కు చేరుకున్నారు.

## సూపర్ సిక్స్ హామీలు గాలికి

- వైసీపీ అనకాపల్లి జిల్లా పరిశీలకురాలు శోభా హైమావతి

పెందుర్తి, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోగా, ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు బనాయించడంపై దృష్టి పెడుతోందని అనకాపల్లి జిల్లా వైసీపీ పరిశీలకురాలు శోభా హైమావతి అన్నారు. మండలంలోని రాంపురం వైసీపీ కార్యాలయంలో బుధవారం వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శోభాహైమావతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పుడున్న పరిస్థితులు పరిశీలిస్తే ఏడాదిలో కూటమి ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోందని అన్నారు. ప్రభుత్వం మోసపూరిత హామీలను ప్రజలకు తెలియజేయాలని, వైసీపీని బలోపేతం చేయాలని ఆమె అన్నారు. అనంతరం అదీప్‌రాజ్ ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెందుర్తి, సబ్బవరం ఎంపీపీలు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడిగుడ్ల దేవిసొంబ తదితరులు పాల్గొన్నారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం

వేపగుంట, మే 21(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురం దగ్గర సింహాద్రినగర్‌లో మంగళవారం అర్ధరాత్రి ఒక ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు 3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. సింహాద్రినగర్‌లో నల్ల సురేష్ కుటుంబం ఓ ఇంట్లో నివాసం ఉంటోంది. మంగళవారం అర్ధరాత్రి వర్షం పడేటప్పుడు వంట గది నుంచి పొగలు రావడం గమనించారు. అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. మంటలు ఆర్పడానికి ఇరుగుపొరుగు వారు సహకరించారు. ఇంతలో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో ఫ్రిజ్, గ్రైండర్, మిక్సీ ఇతర నిత్యవసర వస్తువులు కాలిపోయాయి. స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా ప్రభుత్వం పరంగా సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

## లోతట్టు ప్రాంతాలు జలమయం

- కుండపోతగా వర్షాలు
- చెరువులను తలపిస్తున్న రహదారులు



బీటీఆర్ఎస్ రోడ్డులో ప్రవహిస్తున్న వర్షపునీరు

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 21(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డులోని ఎన్ఏడీ జంక్షన్, బుచ్చిరాజుపాలెం, బాజీ జంక్షన్‌లలో బుధవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లు అన్ని జలమయమయ్యాయి. ముఖ్యంగా బాజీజంక్షన్ నుంచి బుచ్చిరాజుపాలెం వెళ్లే మార్గంలో వర్షపునీరు భారీగా నిలిచిపోయింది. ఎన్ఏడీ ఫ్లైఓవర్ దగ్గర చెత్తా చెదారంతో నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

### వేపగుంటలో

వేపగుంట మే 21(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93, 94, 98వ వార్డుల్లో నాయుడుతోట, వేపగుంట, అప్పన్నపాలెం ప్రాంతాలు బుధవారం కురిసిన వర్షానికి చెరువులను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో గెడ్డలు పొంగిపొర్లాయి. నాయుడుతోట జంక్షన్‌లో వర్షపునీరుతో పాటు మట్టి కూడా కొట్టుకు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

### గోపాలపట్నంలో

గోపాలపట్నం, మే 21(ఆంధ్రజ్యోతి): కుండపోత వర్షం కారణంగా బుధవారం మధ్యాహ్నం గోపాలపట్నం పరిసర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండవాలు ప్రాంతాల నుంచి వచ్చే వర్షంనీరు వ్యవసాయ భూముల్లో నిల్వ ఉంది. కొన్ని రహదారులు చెరువలను తలపిస్తున్నాయి. వర్షానికి స్థానికంగా ఉన్న గెడ్డల్లో నీరు చేరింది.



చెరువును తలపిస్తున్న కొత్తపాలెం అండర్ పాస్‌వే

## రహదారిని అభివృద్ధి చేయరూ!

మల్కాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఐఎన్ఎస్ డేగా, మారుతి సర్కిల్ రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో రహదారిలో విస్తర్ణ పనులు జోరుగా సాగుతున్నాయి. వర్షాలు కురవడం వల్ల రహదారి మరింత ప్రమాదకరంగా మారింది. దీనికితోడు ట్రాఫిక్ సమస్యలు పెరగడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. డాక్‌యార్డు సమీపంలో ఉన్న సర్ధార్ వల్లాబాయ్ పటేల్ వంతెన పునర్నిర్మాణ పనుల కారణంగా పారిశ్రామిక ప్రాంత ప్రజలు నగరానికి వెళ్లాలంటే ములగాడ రహదారిలోనే వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో ప్రతిరోజు వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు.

### అధ్వాన్నంగా ములగాడ రహదారి

ములగాడ రహదారిని నిర్మిస్తామని పోర్టు అధికారులు గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికి అది కార్యరూపం దాల్చలేదు. పారిశ్రామిక ప్రాతం నుంచి నగరానికి వెళ్లాలంటే ములగాడ రహదారి ఒక్కటే షార్ట్‌కట్. అయితే ఈ రహదారి మీద ఎక్కడ చూసినా పెద్దపెద్ద గోతులే దర్శనమిస్తాయి. ఈ కారణంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది అయితే వాహనాలు అదుపుతప్పి గోతుల్లో పడిపోతున్నారు. రాత్రి సమయంలో ఈ దారి మొత్తం చీకటిగా ఉండడం వల్ల ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉందని ములగాడ గ్రామస్థులు వాపోతున్నారు.



ఐఎన్ఎస్ డేగా, మారుతి సర్కిల్ రహదారిలో వరద కారణంగా నిలిచిపోయిన వాహనాలు

## శక్తి యాప్‌పై అవగాహన

గోపాలపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారుల భద్రతకు రాష్ట్ర పోలీస్‌శాఖ రూపొందించిన శక్తి యాప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు కోరుతున్నారు. గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శక్తియాప్ పై అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకులకు శక్తియాప్ పై అవగాహన బుధవారం కల్పించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయావచ్చని వివరించారు. మహిళల సురక్షిత ప్రయాణం కోసం, ఆపదలో ఉన్నప్పుడు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు.

## ఘనంగా బంగారమ్మ జాతర

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం శ్రీ దుర్గమ్మ, బంగారమ్మ గుడిలోని కొలవైన శ్రీ బంగారమ్మ ప్రధాన పండుగను 'త్రివేణి గ్రామ అభ్యుదయ సేవాసంఘం', ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పండుగ పురస్కరించుకుని ఆలయంలో వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు, అర్చనలు చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ బొమ్మిడిరమణ దర్శించుకున్నారు. సాయంత్రం పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది.



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే పి.గణబాబు అధికారులు

## టిడ్కో ఇళ్లను పరిశీలించిన మంత్రి నారాయణ

గోపాలపట్నం, మే 21(ఆంధ్రజ్యోతి): విజయదశమికి యాభైశాతం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో నిర్మించిన టిడ్కో ఇళ్లను మంత్రి నారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏపీలోనే టిడ్కో ఇళ్లు నిర్మించామని అన్నారు. వైసీపీ ప్రభుత్వం భవనాలకు పార్టీ రంగులు వేయడం తప్ప చేసిందేమీ లేదని ఆయన అన్నారు. టిడ్కో ఇళ్లకు పూర్వవైభవం తీసుకువచ్చి లబ్ధిదారులకు అందిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, అధికారులు పాల్గొన్నారు.

## నేడు శారదాపీఠంలో హనుమాన్ జయంతి

పెందుర్తి, మే 21(ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలో శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న వజ్రణి స్కంద పాశుపత హనుమద్యాగం నేటితో ముగుస్తుంది. భారత్, పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో దేశ రక్షణ, దేశ విజయం ఆకాంక్షిస్తూ 11న యాగ నిర్వహణ చేపట్టిన విషయం విదితమే. ద్వాదశ రాత్రులు శాస్త్రోక్తంగా జరిగిన ఈ యాగానికి హనుమజ్జయంతిన పూర్ణాహుతి జరుగుతున్నదని బుధవారం పీఠం శ్రీ కార్యం తెలిపింది. అలాగే హనుమజ్జయంతి సందర్భగా పీఠం ప్రాంగణలో 18 అడుగుల ఏకశిల దాసాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

- 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తిరూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. ఎన్ఏడీ లేఔట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ అందించిన దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనెను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు రావాల్సిన వస్తువులను సకాలంలో అందజేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు చిక్కాల సతీశ్, కాలనీ అభివృద్ధి సంఘ ప్రతినిధులు కె.వి.ఆర్.లక్ష్మి, మాధవి,శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ప్రజారోగ్యశాఖ సభ్యులు పాల్గొన్నారు.

## శాస్త్ర-సాంకేతిక రంగాభివృద్ధికి రాజీవ్‌గాంధీ కృషి

- గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్

మల్కాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర-సాంకేతిక రంగాలలో భారతదేశాన్ని అభివృద్ధి చేయడానికి దివంగత నేత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని స్థానిక గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ పేర్కొన్నారు. బాలల వేసవి శిక్షణా శిబిరంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ రంగ పురోభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఎనలేని సేవలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయాదేవి, కార్యకర్తలు సునిత, జ్యోతిర్మయి పిల్లకు పాటల పోటీలు న్విహించారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గోపాలపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా బాజీజంక్షన్, రెడ్డివీధి, సుసర్లా కాలనీ, జయప్రకాశ్‌నగర్, ఎస్సీకాలనీ, విద్యానగర్, రవీంద్రనగర్, రైల్వేస్టేషన్ ఏరియా, నాయుడు క్వార్టర్స్ బంక్ ఏరియా, బాపూజీనగర్, వుడాకాలనీ, టైలర్స్ కాలనీ, ప్రశాంతినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండన్నారు.

## యోగ సిద్ధాంజనేయ స్వామికి అష్టోత్తర శత కలశాభిషేకం


హనుమంతునికి అభిషేకం చేస్తున్న దృశ్యం

మురళీనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తరంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో యోగసిద్ధాంజనేయ స్వామి మందిరంలో చేపడుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో రెండో రోజు బుధవారం స్వామి మంగళధ్వని వేదమంత్రాలతో శత కలశస్నపనం కార్యక్రమాన్ని విశిష్టంగా నిర్వహించారు. 108 కలశాలతో పలు నదీ జలాలను ఆలయ పండితులు శ్రీకాంత్ ఆచార్యులు స్వామి వారికి పంచామృత అభిషేకం జరిపారు. అనంతరం భక్తులు సామూహిక సుందరకాండ పారాయణం, విశేష హోమాలు జరిపారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పి.సుబ్బరాజు, యశోద దంపతులు, కమిటీ సభ్యులు ఎం.వి.రాజశేఖర్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## 170 మందికి కంటి పరీక్షలు


శిబిరంలో మాట్లాడుతున్న సీనియర్ మేనేజర్ జి.సుబ్బారాయుడు

కంచరపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు పరిధి కప్పరాడ లో బుధవారం శంకర్ ఫౌండేషన్ సహకారంతో దక్షిణాసియా లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ సంస్థ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించింది. సంస్థ సీనియర్ మేనేజర్ జి.సుబ్బారాయుడు, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డీజీఎం వి.రమేష్ తదితరులు శిబిరాన్ని ప్రారంభించారు. కప్పరాడ పరిసర ప్రాంతాల్లోని పేదల కోసం ఈ శిబిరాన్ని నెలరోజులు నిర్వహించి కంటి సంరక్షణ సేవలు అందించనున్నట్టు పేర్కొన్నారు. బుధవారం 170 మందిని పరీక్షించి ఉచితంగా కళ్లద్దాలు,మందులను పంపిణీ చేశారు. అవసరమైనవారికి శంకర్ ఫౌండేషన్ ద్వారా శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. ఆసుపత్రి డీజీఎం కె.బంగార్రాజు మాట్లాడుతూ ఉచిత కంటి పరీక్ష శిబిరాలను సులభతరం చేయాలన్న ఉద్దేశంతో శంకర్ ఫౌండేషన్ సంస్థకు చేదోడుగా నిలవనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రాకేష్ కుమార్ పాల్గొన్నారు.

# 50, 51 వార్డుల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

మాధవధార, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలోని 50, 51 వార్డుల్లో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కొత్త పనులకు భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. 51వవార్డు భీమ్‌నగర్‌లో పునర్నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని, వంశీనగర్‌లో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆరంభించారు. ఇక్కడి సమస్యాత్మక గెడ్డ ప్రాంతం వద్ద రక్షణ గోడలు, నడక మార్గం నిర్మాణాలకు భూమిపూజ చేశారు. 50వవార్డు సాయిరాంనగర్‌లో రోడ్లు, కాలువల నిర్మాణాలకు, వంశీనగర్‌లో కొత్త కల్వర్టులకు భూమిపూజ చేశారు. మొత్తంగా రూ.1.16 కోట్లతో చేపట్టిన పనుల ప్రారంభ కార్యక్రమంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీడీపీ మైనార్టీ నాయకులు ఎండి.నజీర్, 50వవార్డు కార్పొరేటర్ వి.ప్రసాద్, 51వ వార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ, స్థానిక నాయకులు కార్యక్రమంలో ఉన్నారు. తమకు ముందస్తు సమాచారం , తగిన ప్రాతినిధ్యం ఉండటం లేదని 50వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కూన. వెంకటరావు, టీడీపీ అధ్యక్షుడు సనపల. వరప్రసాద్ సహా వార్డు కార్యకర్తలు కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. కీలక నాయకులు ఫోన్‌లో సంప్రదించినా హాజరుకాలేదు.


నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, నగర మేయర్ పి.శ్రీనివాసరావు తదితరులు

## వెటరన్ క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రీడాకారులతో సి.హెచ్.శ్రీనివాసరాజు తదితరులు

మురళీనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి); రాజస్థాన్ అళ్వార్‌లో ఫిబ్రవరిలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం'కు చెందిన క్రీడాకారులను బుధవారం జిల్లా కో-ఆర్డినేటర్ సి.హెచ్.శ్రీనివాసరాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో మలేషియాలో జరగనున్న 37వ అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో దేశ పతాకాన్ని రెపరెపలాడించాలని ఆకాంక్షించారు. మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, పది వేల రూపాయల నగదు సాయం అందించారు. అంతర్జాతీయ పోటీలకు కె.పూర్ణిమ, కె.మత్స్యకొండ, కె.బి.ఎం.కృష్ణప్రసాద్‌లు హాజరవుతున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డోనర్ కమల్ బైద్, వెటరన్ అసోసియేషన్ చీఫ్ అడ్వయిజర్ సి.హెచ్.సత్యదేవ్ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ సెక్రటరీ జనరల్ మంగప్రసాద్, కోశాధికారి ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ లేక ఇబ్బందులు

సీతమ్మధార, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత విద్యార్థులకు ఏ ధ్రువపత్రం కావాలన్నా అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం చేసుకునే దరఖాస్తులను వీఆర్‌ఓ పరిశీలించాక కచ్చితంగా ఆర్ఐ తనిఖీ చేసి తహసీల్దార్‌కు సిఫార్సు చేస్తారు. కొద్ది రోజులుగా అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాలు పొందలేక కొన్ని అవకాశాలు కోల్పోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్ఐ ఆర్డీఓ కార్యాలయానికి, తరువాత వచ్చిన మహిళ డిప్యుటేషన్‌పై కలెక్టర్ ఆఫీస్‌కి వెళ్లిపోయారు. దీంతో ధ్రువపత్రాలు పొందలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఒత్తిళ్లు భరించలేక ఇతర కార్యాలయాలకు వెళ్లిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# రైల్వే ఆసుపత్రిలో డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు


రోగిని పరామర్శిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రిలో డీఆర్ఎం లలిత్ బొహ్రా బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అవుట్ పేషెంట్ విభాగం, ఆపరేషన్ థియేటర్, మెడికల్, సర్జికల్ స్టోర్లు, డయాలసిస్ యూనిట్లు, రోగుల వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, పారిశుధ్య నిర్వహణపై రోగులతో మాట్లాడి పలు వివరాలు సేకరించారు. అలాగే సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణలో చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం వైద్యులతో పలు అంశాలపై చర్చించి రోగుల సంరక్షణకు సంబంధించి పలు సూచనలు చేస్తూ, అవసరాలపై సకాలంలో స్పందించి వ్యాధులను నయం చేసేలా సేవలందించాలన్నారు. ఆసుపత్రి నిర్వహణ, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌బాబు, డాక్టర్ చారుమతి, డాక్టర్ లక్ష్మణరావు, సీనియర్ డీపీవో కబీర్ అన్సారీ, సీనియర్ డీఈ జగదీష్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మందుబాబులకు అడ్డాగా ప్రజారోగ్య కేంద్రం

అక్కయ్యపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని ప్రజారోగ్య కేంద్రం పరిసరాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. ప్రజారోగ్య కేంద్రంలో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు సచివాలయాలు ఉన్నాయి. చీకటి పడగానే మందుబాబులు ఇక్కడ చేరి మద్యం పూటుగా తాగి, అటుగా రాకపోకలు సాగిస్తున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అంటున్నారు. శ్రీనివాస నగర్‌లో రాత్రి సమయంలో రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. ఒకవేళ ఏదైనా అవసరం ఉండి అటువైపు వెళ్తే మందుబాబులు చుక్కలు చూపిస్తున్నారని పలువురు వాపోతున్నారు. మద్యం సీసాలు, గ్లాసులను ప్రజారోగ్య కేంద్రానికి ఆనుకుని ఉన్న మెట్ల కింద సందులో పడేస్తున్నారు. ఎవరైనా మందుబాబులను ప్రశ్నిస్తే వారిపై దాడికి కూడా వెనుకాడడం లేదంటున్నారు. పోలీ గస్తీ తిరగాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రజారోగ్య కేంద్రం మెట్ల కింద పడేసిన మద్యం సీసాలు

## కూటమిలో ఆధిపత్య పోరు

(5వ పేజీ తరువాయి)

సమావేశమా?, అలాగైతే కూటమిలోని అన్ని పార్టీల ఇన్‌చార్జులను కూడా సమావేశానికి ఆహ్వానించాలి కదా?, ఒక్క టీడీపీ వారినే పిలవడం ఏమిటి?' అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ, ఎలమంచిలిలో '50 శాతం ఎమ్మెల్యే' తానేనంటూ ప్రగడ నాగేశ్వరరావు అధికారులను తన వద్దకు రావాలని బెదిరిస్తున్నారని, ఆయన ప్రతిపాదించిన అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారని...ఇలా '50 శాతం ఎమ్మెల్యే'లు ఎక్కడైనా ఉంటారా? అని ప్రశ్నించారు. ఈ దశలో గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులైన పల్లా శ్రీనివాసరావు కల్పించుకొని చేసిన సేవలను గుర్తించి కొందరికి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించామని, వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే మరికొందరికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామని, వారు ఏదైనా అంశంపై సలహాలు మాత్రం ఇవ్వవచ్చునన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాటే చెల్లుబాటు అవుతుందని స్పష్టంచేశారు. పార్టీ రాష్ట్ర నాయకుడిగా పల్లా శ్రీనివాసరావు స్పష్టత ఇవ్వడంతో ఆయా నియోజకవర్గాల్లో ఇకపై విభేదాలు తగ్గుతాయని భావిస్తున్నారు.

## ఉక్కులో డీజీఎం రాజీనామా

(5వ పేజీ తరువాయి)

ఆయన అంగీకరించలేదు. వారిని తగ్గిస్తే ఆ విభాగంలో అనుకున్న పనులు జరగవని, లక్ష్యం సాధించలేమని యాజమాన్యానికి తెలియజేశారు. కాంట్రాక్టు కార్మికులను తగ్గించకపోతే, రాజీనామా చేసి వెళ్లిపోవాలని యాజమాన్యం పేర్కొనడంతో ఆయన వెంటనే రాజీనామా చేసేశారని తెలిసింది. కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్న యాజమాన్యం బాగా పనిచేసే అధికారులను సైతం తొలగించడం అన్యాయమని ఉద్యోగ వర్గాలు విమర్శిస్తున్నాయి.

## టీడీపీ ఫ్లోర్ లీడర్ పదవికి తీవ్ర పోటీ

(5వ పేజీ తరువాయి)

ఎన్నికకు హాజరయ్యారు. మరోవైపు డిప్యూటీ మేయర్ పదవి కోసం చివరి వరకూ పోటీపడిన గొలగాని మంగవేణి, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు కూడా ఫ్లోర్ లీడర్ పదవిని ఆశిస్తున్నారు. ఎవరికి అవకాశం దక్కుతుందో చూడాలి.

## ఉమ్మడి జిల్లాలో 93 హెచ్‌ఎం పోస్టులు ఖాళీ

(5వ పేజీ తరువాయి)

ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేకపోతే కేటగిరీ-4లో ఉన్న పోస్టులకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. బదిలీలకు గురువారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బదిలీల దరఖాస్తు చేసే సమయంలో సందేహాల నివృత్తికి సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ ఉన్నత పాఠశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రోజూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హెల్ప్ డెస్క్ పనిచేస్తుందని చెప్పారు.

## రౌడీషీటర్ల కదలికలపై నిఘా

(5వ పేజీ తరువాయి)

చొరబడితే వెంటనే వారిని గుర్తించేందుకు వీలుగా విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్ (వీఎంఎస్)ను వినియోగించుకోవాలని సూచించారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, వేధింపులు, మిస్సింగ్ కేసుల నమోదు, దర్యాప్తులో జాప్యం జరిగితే సహించేది లేదని స్పష్టంచేశారు. కోర్టుల్లో కేసులు పెండింగ్ లేకుండా చూడడంతోపాటు శిక్ష పడే కేసుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. వచ్చేనెల నిర్వహించే సమీక్షకు అధికారులు తమ పనితీరును మెరుగుపరుచుకున్నట్టు నిరూపించుకోవాలన్నారు. పోలీసులు ఎవరైనా అవినీతికి పాల్పడినా, నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించినా, రౌడీషీటర్లు, నేరస్థులకు సహకరిస్తున్నట్టు తెలిసినా కఠినచర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీపీలు అజితావేజెండ్ల, మేరీప్రశాంతి, లతా మాధురి ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మలేరియా పోస్టుల పందేరం!

(5వ పేజీ తరువాయి)

కేటాయిస్తున్నట్టు చెబుతున్నారు. దీనివల్ల పాతవారికి అవకాశం లేకుండా పోవడంతోపాటు కొత్తగా తీసుకునేవారి నుంచి డబ్బులు వసూలు చేసేందుకు వీలు కల్పించినట్టవుతుంది. ఇదే అదనుగా కొంతమంది కార్పొరేటర్లు మలేరియా కార్మికుడి పోస్టు ఇప్పిస్తామంటూ ఆశావహుల నుంచి అవకాశం ఉన్నంతమేర వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయమై ఇటీవల డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా కొంతమంది కార్పొరేటర్ల మధ్య చర్చ జరిగింది. పాతవారిని తొలగించడం సరికాదని కొందరు అభిప్రాయపడితే, మరికొందరు మాత్రం వైసీపీ పాలకవర్గం ఉన్నప్పుడు వారు డబ్బులు తీసుకునే పోస్టులు ఇచ్చారు కాబట్టి, ఇప్పుడు మనం కూడా అలా చేయడంలో తప్పేముందని వాదించారు.

# 2.5 లక్షల మందితో యోగా డే

(5వ పేజీ తరువాయి)

సరఫరా చేస్తోంది. యోగా ప్రదర్శనకు నగరంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి సాధకులను సమీకరిస్తున్నారు. నగరం, పరిసర ప్రాంతాల నుంచి ప్రదర్శన ప్రాంతాలకు తీసుకురావడానికి వాహనాలు సమకూరుస్తారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాలు గుర్తించారు. ప్రదర్శన అనంతరం ప్రతి ఒక్కరికీ స్నాక్స్, మంచినీరు అందిస్తారు.

**ప్రధాని కోసం ఏయూలో హెలిప్యాడ్లు**

వచ్చే నెల 20వ తేదీ సాయంత్రం నగరానికి రానున్న ప్రధాని ఆరోజు రాత్రి ఐఎన్ఎస్ చోళాలో బస చేస్తారు. ఆ మరుసటిరోజు ఉదయం ఆరు గంటలకు హెలికాప్టర్‌లో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ల్యాండ్ అవుతారు. ఐఎన్ఎస్ చోళా నుంచి మూడు హెలికాప్టర్లు ఒకేసారి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుంటాయి. హెలికాప్టర్లు ఢిల్లీ నుంచి రానున్నాయి. ఏయూలో హెలిప్యాడ్ నుంచి ప్రధాని బీచ్‌రోడ్డుకు చేరుకుంటారు. కాగా ఆర్కే బీచ్‌లో ప్రధాని పాల్గొనే వేదికకు ఎదురుగా సముద్రంలో తూర్పు నౌకా దళానికి చెందిన ఒక యుద్ధ నౌకలో యోగా ప్రదర్శన నిర్వహిస్తారు.

# ఫ్లై ఓవర్లు అవసరం

(5వ పేజీ తరువాయి)

టీడీఆర్‌లు ఆన్‌లైన్‌లో విక్రయించుకునే అవకాశం కల్పించాలన్నారు. అధికారులు ఏమైనా అభివృద్ధి పనులు ప్రతిపాదించినప్పుడు వాటిని ముందుగా ఎమ్మెల్యేలకు తెలియజేయాలని చెప్పగా, స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమర్థించారు. నాయకులు వారి పార్టీ మైలేజీ కోసం వాటిని ప్రచారం చేసుకుంటారని, ప్రజలకు చేరువుగా తీసుకువెళతారని, ఇరు వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయానికి వెళ్లాలంటే రెండు గంటల సమయం పడుతుందని, ట్రాఫిక్ సమస్య తీరేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. మారియట్ హోటల్ వద్ద ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇచ్చారని, స్థలానికి టీడీఆర్‌లు ఇవ్వాలని కోరారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రహదారుల నిర్మాణాలపై మాట్లాడారు. మరికొందరు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ వాటర్ పైపులైన్లు త్వరగా పూర్తిచేయాలని, ఎక్కడికక్కడ నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని కోరారు. కొండవాలు ప్రాంతాల్లో వ్యర్థాలను తరలించే వాహనాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. పేదల వద్ద 2014లో డీడీలు కట్టించుకున్నామని, వారికి ఇళ్లు అప్పగించాలని మరో ఎమ్మెల్యే కోరారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ, సింహాచలం పంచ గ్రామాల సమస్య, అనకాపల్లి ల్యాండ్ పూలింగ్, బీచ్ కారిడార్ వంటి అంశాలపై త్వరలోనే కీలక నిర్ణయాలు వస్తాయన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఇకపై ప్రతి నెలా సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. సమావేశంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొండపల్లి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణ మూర్తి, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాస్, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, విజయనగరం కలెక్టర్ అంబేద్కర్, అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, పురపాలక కమిషనర్ సంపత్‌కుమార్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ పాల్గొన్నారు.

## నేడు దుర్గాలమ్మ ప్రధాన పండగ

అల్లిపురం, మే 21 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురం జెండా చెట్టు వీధిలో ఉన్న విజయదుర్గాలమ్మ ప్రధాన పండగ గురువారం జరగనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు బుధవారం అమ్మవారి తొలేళ్ల సంబరం జరిపారు. ప్రధాన ఉత్సవంలో భాగంగా తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి దుర్గా హోమం చేయనున్నారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. మూడేళ్లకు ఒకసారి ఈ పండగ చేస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు గురుమూర్తి తెలిపారు.

## వీధి వ్యాపారులు వివరాలు నమోదు చేసుకోవాలి

జ్ఞానాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-5 పరిధిలో ఉన్న వీధి వ్యాపారులు శుక్రవారంలోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని జోనల్ కమిషనర్ బి. రాము తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వీధి వ్యాపారులు తమ వివరాలను సచివాలయంలోని వెల్ఫేర్ కార్యదర్శికి తెలియజేయాలని చెప్పారు. సర్వేలో నమోదైన వారికి ప్రభుత్వం వెండర్ కార్డు, వెండర్ సర్టిఫికెట్ జారీ చేస్తుందని తెలిపారు.

## హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

అల్లిపురం, మే 21 (ఆంధ్రజ్యోతి) : కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ఉన్న ప్రసన్న అంజనేయస్వామి, వెంకటేశ్వర మెట్ట అభయాంజనేయస్వామి, అచ్చియ్యమ్మపేట అభయహస్తాంజనేయ స్వామి ఆలయాలు హనుమాన్ జయంత్యుత్సవాలకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఆయా ఆలయాల కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

## 550 గ్రాముల బరువుతో శిశువు జననం

మహారాణిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : కేవలం 550 గ్రాముల బరువుతో జన్మించిన శిశువును మెడికవర్ వైద్య నిపుణులు తమ పర్యవేక్షణలో ఉంచుతూ వైద్య సేవలు అందించి ఆరోగ్యకరంగా మార్చారు. మహారాణిపేటలో ఉన్న మెడికవర్ విమెన్ అండ్ చైల్డ్ విభాగంలో బుధవారం నియోనెంటాలజిస్టు డాక్టర్ సాయిసునీల్ కిషోర్ ఇందుకు సంబంధించి వివరాలు తెలిపారు. విశాఖకు చెందిన ఓ గర్భిణి అధిక రక్తపోటుతో బాధపడుతూ ఉండడంతో సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయి. 25 వారాలకే 550 గ్రాముల అతి తక్కువ బరువుతో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ శిశువుకు ఊపిరితిత్తులు అభివృద్ధి చెందలేదు. రోగనిరోధక శక్తి లేకపోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. నియోనెంటల్ ఎన్ఐసీయూలో వెంటిలేటర్ ద్వారా నాన్ ఇన్వాసివ్ శ్వాసకోశ అవసరమైన ఫొటోథెరపీ ఎలక్ట్రోలైట్ ప్రత్యేక చికిత్స అందించారు. సుమారు 50 రోజుల వైద్య సేవల అనంతరం ఆ శిశువు 1.7 కిలోల బరువు పెరిగి సాధారణ మెదడుతో పూర్తి ఆరోగ్యంతో కోలుకుంది. ఈ మిరాకిల్ బేబీని డిశ్చార్జి చేశామని ఆయన తెలిపారు. ఈ శిశువు కోలుకోవడం అసాధారణమని, వైద్యులు విజయ, మౌనిక, శ్రీరంగ, నర్సింగ్ సిబ్బంది అందించిన సేవలతోనే పసికందు కోలుకున్నట్టు ఆయన తెలిపారు.

## కేజీహెచ్ సీఎస్ ఆర్ఎంఓగా డాక్టర్ శ్రీహరి

మహారాణిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్ సీఎస్ ఆర్ఎంఓగా డాక్టర్ శ్రీహరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి డీఎంహెచ్ఓగా పని చేసిన ఆయన్ను కేజీహెచ్ సీఎస్ ఆర్ఎంఓగా బదిలీ చేశారు. ఆయన నియామకంతో 15 ఏళ్ల అనంతరం పూర్తిస్థాయి సీఎస్ ఆర్ఎంఓ పోస్టును భర్తీ చేసినట్టు అయ్యింది.

## రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ రెండోజోన్ కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 23న మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బీకే.నాయుడు తెలిపారు. కంచరపాలెం సెక్షన్‌లోని ఆశవానిపాలెం, నావల్ క్వార్టర్స్, చాకలి గెడ్డ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మంత్రి నారాయణకు వినతుల వెల్లువ

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణకు వివిధ సమస్యలపై పలువురు వినతులు అందజేశారు. వీఎంఆర్‌డీఏ కాంప్లెక్స్‌లో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి వినతిపత్రాలు ఇచ్చారు. వైసీపీ పాలనలో జారీ చేసిన రేవళ్లపాలెం సర్వే నంబర్ 2/పి, మధురవాడ బక్కన్నపాలెం రోడ్డులో అక్రమ టీడీఆర్‌లను రద్దు చేయాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మంత్రిని కోరారు. జీవీఎంసీకి నాలుగు నెలలుగా కమిషనర్ లేకపోవడంతో నగరంలో అభివృద్ధిపై ప్రభావం పడుతోందని, తక్షణమే కమిషనర్‌ను నియమించాలన్నారు. అలాగే జీవీఎంసీ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని కోరుతూ మంత్రి నారాయణకు ఏపీ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆనందరావు, కార్యదర్శి సత్యం వినతిపత్రం అందజేశారు. కేవలం ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్‌కార్మికులకే జీతాలు పెంచారని, ఇంజనీరింగ్, నీటి సరఫరా విభాగాల్లో పనిచేస్తున్న వారికి కూడా జీతాలు పెంచాలని విన్నవించారు.

**సమస్యలు పరిష్కరించాలి**

మహారాణిపేట : వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని ఆ అసోసియేషన్ ప్రతినిధులు, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణను కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేశ్ కుమార్ మాట్లాడుతూ ఐదేళ్లుగా వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా పని చేస్తున్న తమకు జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించాలన్నారు. అలాగే నోడల్ లేదా జోనల్ స్థాయిలో కొత్త పోస్టులు సృష్టించి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ హోదాలో పదోన్నతి కల్పించాలని కోరారు, ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి బంగారురాజు, అశోక్‌కుమార్, సాయికృష్ణ, పవన్‌కుమార్, రవితేజా, ఎస్. నానాజీ, బి. రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి నారాయణకు వినతిపత్రం అందిస్తున్న వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు

## తొమ్మిది రోజులు ఎన్టీఆర్ వజ్రోత్సవాలు

డాబాగార్డెన్స్, మే 21 (ఆంధ్రజ్యోతి) :నగరానికి చెందిన పది సినీ సంగీత సంస్థలు గురువారం నుంచి తొమ్మిది రోజుల పాటు ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు ఆల్ ఫ్రెండ్స్ మ్యూజిక్ అసోసియేషన్, విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం ప్రతినిధులు తెలిపారు. బుధవారం వారు డాబా గార్డెన్స్‌లో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతుల మీదుగా 'ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు...నవరస పాత్రలు- నవ రాగ రాత్రులు' పేరిట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ నటించిన చిత్ర గీతాలను ప్రతిరోజూ 30 చొప్పున 300 పాటలు ఆలపించనున్నట్టు చెప్పారు. పౌర గ్రంథాలయంలోని ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నటరత్న కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి డి. భూపతిరావు, స్వరాంజలి సహాయ కార్యదర్శి ఎంవీఆర్ నాగేశ్వరరావు, భయ్యా శ్రీనివాస్, కృష్ణంరాజు, అల్లిబిల్లి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

## హోటల్ గ్రీన్ పార్కులో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

మహారాణిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : హోటల్ గ్రీన్ పార్కులో బుధవారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు నేషనల్ సిల్క్ ఎక్స్ పో నిర్వహిస్తున్నారు. వివాహ వేడుకలు, వేసవి సీజన్ నేపథ్యంలో భారతీయ చేనేత వస్త్ర సంప్రదాయ, ఆధునికత కలబోసిన సంపూర్ణ వస్త్ర ప్రదర్శన ఒకేచోట ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో షాపింగ్ చేయడం ఓ మధురానుభూతి అని నిర్వాహకులు తెలిపారు. మగ్గాలపై నేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచామన్నారు. మహారాష్ట్ర పైదాని సిల్క్, బెంగళూర్ సిల్క్, సాఫ్ట్ సిల్క్, కషిదా సిల్క్ చీరలు, లెనిన్ కాంతా వర్క్, చందేరి మహేశ్వరి సిల్క్ చీరలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు ప్రదర్శన ఉంటుందని, ప్రవేశం ఉచితమని నిర్వాహకులు తెలిపారు.


వస్త్ర ప్రదర్శనలో అమ్మకానికి ఉంచిన చీరలు

# నిరుపయోగంగా బస్సు షెల్టర్లు

» సర్వీసులు లేని మార్గాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం » ప్రకటన బోర్డులుగా మారుతున్న వైనం

వెంకోజీపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఈ మార్గంలో సిటీ బస్సులు నడిచేది ఒక్కటే రూట్ నెం.69 అది రోజుల్లో మూడు, నాలుగు సార్లు మాత్రమే. ఇక బస్సు కోసం వేచి ఉండాల్సిన పని కూడా ప్రయాణికులకు లేకపోయే. ఈ క్రమంలో లక్షలు ఖర్చు చేసి బస్సు షెల్టర్ల నిర్మాణం కేవలం ప్రకటన బోర్డులకు మాత్రమే పరిమితమయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ ఎంఎంటీసీ కాలనీ ఎల్‌ఐసీ అపార్టుమెంట్ల వద్ద నిరుపయోగం ఉన్న బస్సు షెల్టరు దుస్థితి.



ఎంఎంటీసీ కాలనీ ఎల్‌ఐసీ అపార్టుమెంట్‌ల వద్ద నిర్మించిన బస్సు షెల్టర్

ఈ మార్గంలో ఒకప్పుడు 20ఏ, 69 బస్సులు రోజులో పది ట్రిప్పులు వేసేవి. కొన్నాళ్ల తర్వాత 20ఏ బస్సు సర్వీసుకు ఆదరణ లేదన్న నెపంతో ఆ సర్వీసును ఆర్టీసీ అధికారులు పూర్తిగా రద్దు చేశారు. కాగా అరగంటకు ఒక బస్సు చొప్పున నడిపిన రూట్ నెం.69ని కూడా ప్రస్తుతం ఉదయం రెండు సార్లు, సాయంత్రం రెండు సార్లు చొప్పున నడుపుతున్నారు. దీంతో సహజంగానే ఈ సర్వీసుకు ఆదరణ లేకుండా పోయింది. బస్సు షెల్టరు అవసరం లేదనే హెచ్‌బీ కాలనీ ఆఖరు బస్టాప్ వద్ద ఇంతకు ముందు ఉండే రెండు షెల్టర్లను పూర్తి తొలగించారు. కానీ ఎల్‌ఐసీ అపార్టుమెంట్ ల వద్ద మాత్రం బస్సుషెల్టరును ప్రకటనలకు వినియోగించుకునేందుకు ఉంచారు.

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తానని చెబుతుంది. ఈ మార్గంలో ఎక్కేందుకు బస్సులే లేకపోతే ఉచిత ప్రయాణం తమకెందుకని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం 20ఏ బస్సును పునరుద్ధరించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. మరో నెలలో స్కూల్‌లు కూడా ప్రారంభమౌతాయని, చిన్నారులు బస్సులు లేకపోవడంతో ఆటోలపై స్కూళ్లకు వెళ్లాల్సిన దుస్థితి. ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థులు, మహిళలను దృష్టిలో ఉంచుకుని 20ఏ బస్సులను పునరుద్ధరించడంతో పాటు, 69 బస్సు ట్రిప్పులను కూడా పెంచాలని వారు కోరుతున్నారు.

## రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసిన మేయర్



మంత్రి నారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, మే 21(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు బుధవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు పి.నారాయణను వీఎంఆర్డీఏ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ నగరాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించేందుకు విచ్చేసిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసి విశాఖ నగరాభివృద్ధికి అధిక శాతం నిధులు కేటాయించాలని మంత్రిని మేయర్ విజ్ఞప్తి చేశారు. విశాఖ నగరాభివృద్ధికి నిధులు కేటాయిస్తామని మేయర్‌కు మంత్రి హామీ ఇచ్చారు.

## చినగదిలిలో చురుగ్గా విభిన్న ప్రతిభావంతుల సర్వే

» ఎంఈవో పి.అనూరాధ



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో అనూరాధ

ఆరిలోవ, మే 21 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు సర్వే చినగదిలి మండల పరిధిలో చురుకుగా సాగుతోందని చినగదిలి మండల విద్యాశాఖాధికారి పి.అనూరాధ అన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎంఈవో అనూరాధ ఆధ్వర్యంలో 0-18 సంవత్సరాల గల పిల్లలను గుర్తించి, వారిని తోటగరువులోని గల భవిత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి అనూరాధ భవిత సెంటర్‌లో పిల్లలకు అందిస్తున్న సేవల గురించి తల్లిదండ్రులకు వివరించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఫిజియో థెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్ వంటి సేవలతో పాటు గుర్తింపు శిబిరాల ద్వారా అవసరమైన ఉపకరణాలు అందజేయడం జరుగుతుందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, హోంబేస్డ్ అలవెన్స్‌లను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. భవితలో చేర్పించేందుకు ఫోన్ నెంబరు 83097 21621లో సంప్రదించాలని తెలిపారు. ఈ సర్వేలో భవిత ఉపాధ్యాయులు ఎస్‌కె సలీమా, ఎస్.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్-3** :సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచర పాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 18, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 32, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 18, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 545 |
| విజయనగరం | 549 |
| శ్రీకాకుళం | 549 |

**చికెన్ ధరలు**

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | 105 |
| లైవ్ ధర | 125 |
| విత్ స్కిన్ | 220 |
| స్కిన్‌లెస్ | 230 |

## మొక్కుబడిగా వీధివిక్రయదారుల సర్వే

» 22వ వార్డులో సచివాలయ సిబ్బందిపై విమర్శలు

» పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారంటూ ఆరోపణలు

» సర్వే చేస్తున్న సంగతే తెలియదంటున్న పలువురు చిరు వ్యాపారులు




పిఠాపురంకాలనీలో సర్వే నమోదు చేయని తోపుడు బండ్ల వ్యాపారులు

మద్దిలపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో వీధి విక్రయదారుల సర్వే మొక్కుబడిగా సాగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిరువర్తకుల వివరాలనమోదులో సచివాలయాల వెల్ఫేర్ సెక్రటరీలు పక్షపాత వైఖరి చూపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారికి అనుకూలంగా ఉన్నవారి వివరాలు మాత్రమే నమోదు చేస్తున్నారని, మిగతా వారిని విస్మరిస్తున్నారని పలువురు వీధి విక్రయదారులు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి వ్యాపారాలు చేస్తున్న వర్తకులు దరఖాస్తులు చేసుకున్నా సర్వేలో చోటు కల్పించడం లేదంటూ మండిపడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు వీధి విక్రయదారులకు అందించేందుకు వారి వివరాలతో కూడిన సర్వేను ప్రారంభించారు. వీధివ్యాపారులు.. ఎప్పటి నుంచి వ్యాపారం చేస్తున్నారు. వారి కుటుంబ పరిస్థితులు, వ్యాపార నష్టాలు-లాభాలు.. ఇలా అనేక రకాల వివరాలతో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే ఆధారంగా స్ట్రీట్ వెండింగ్ కార్డులు అందించడం చేయనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. ఈ కార్డుల ఆధారంగా ప్రభుత్వం అమలు చేసే పథకాలను వీధి వ్యాపారులకు వర్తింపజేస్తారు. సచివాలయాల వెల్ఫేర్ సెక్రటరీలు ద్వారా చేయిస్తున్న ఈ సర్వే ఈ నెల 23తో ముగిస్తుంది. ఈలోగా సర్వేలో నమోదు కాని వారు నమోదు చేసుకోవాలని జోన్-3 జోనల్ కమిషనర్ మంగళవారం ప్రకటన కూడా విడుదల చేశారు. అయితే 22వ వార్డు పిఠాపురం కాలనీ 149 సచివాలయ పరిధిలో 30 తోపుడు బండ్ల వ్యాపారస్తులు, 80 వరకు ఇతర వర్తకులు ఉన్నారు. వారందరికీ సచివాలయ కార్యదర్శి సర్వే చేసి వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కొంతమందికి మాత్రమే సర్వే చేస్తున్నట్టు విషయం తెలిపి దరఖాస్తులు అందించారు. చాలామందికి ఇలాంటి సర్వే చేస్తున్నట్టు కూడా తెలియకపోవడం గమనార్హం. వీధి విక్రయదారుల సర్వే జరుగుతోందని తెలుసుకుని తోపుడు బండ్ల వర్తకులు తమ వివరాలతో వెల్ఫేర్ కార్యదర్శి వద్దకు వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సచివాలయ ఉద్యోగులు తమపట్ల పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని తోడుపు బండ్ల వర్తకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి సర్వే సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## విశాఖ ఆర్టీసీ ఆర్‌ఎంకు ఎండీ ప్రశంస

ద్వారకాబస్‌స్టేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, మంచి ఫలితాలు సాధించిన విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడును ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అభినందించారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన ఆర్టీసీ డైరెక్టర్లు, జిల్లా మేనేజర్ల సమావేశంలో అప్పలనాయుడుకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఉత్తమ కేఎంపీఎల్, ఈపీకే సాధనకు గుర్తింపు లభించింది.



విశాఖ ఆర్టీసీ ఆర్‌ఎం అప్పలనాయుడుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

### ఆర్టీసీ డ్రైవర్లు సమయపాలన పాటించాల్సిందే: ఆర్‌ఎం

ద్వారకాబస్‌స్టేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సులు షెడ్యూల్ సమయం పాటించాల్సిందేనని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పల నాయుడు డ్రైవర్లను ఆదేశించారు. ద్వారకాబస్‌స్టేషన్‌కు రాకపోకలు సాగించే దూరప్రాంత సర్వీసుల సమయాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా నిర్దేశిత సమయం మేరకు బస్సులు నడపాలని సూచించారు. ద్వారకాకాంప్లెక్సు స్టేషన్ మేనేజర్ రాజు, కంట్రోలర్లు ఆర్‌ఎం వెంట ఉన్నారు.

## వన్య ప్రాణుల సంరక్షణ బాధ్యత యువతపై ఉంది

» ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ మంగమ్మ



జూలో వివిధ విభాగాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ, మే 21, (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణులను పరిరక్షించే బాధ్యత నేడు యువతపై ఉందని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన క్యూరేటర్ జి.మంగమ్మ అన్నారు. ఇందిరాగాంధీ జంతు పదర్శన శాలలో 'వన్య ప్రాణుల మనుగడ, వాటిని అన్వేషించడం' అనే కార్యక్రమంపై విద్యార్థులు, జంతు ప్రేమికులతో నిర్వహించనున్న ఐదు రోజుల వేసవి శిబిరంలో తొలి రోజైన బుధవారం ఆమె మాట్లాడుతూ.. జీవీఎంసీ వైల్డ్ లైఫ్ కన్సర్వేషన్ త్రూ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ గ్రీన్‌ప్లాజా, యూత్ కన్జర్వేషన్ నెట్ వర్క్ వారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వన్య ప్రాణుల ప్రపంచాన్ని తెలుసుకోవడానికి, వాటిని గురించి అన్వేషించడం, అనుసంధానం చేయడం వంటివి అద్భుత అవకాశంగా ఉంటాయన్నారు. ఈ ఐదు రోజుల్లో జంతువులతో పాటు వాటిని ఆదరిస్తున్న, ప్రకృతి పట్ల అవగాహన కలిగించేలా వివిధ థీమ్ ఆధారిత కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.ఈ ఐదు రోజుల్లో జంతు ప్రపంచం, వాటి సంరక్షణ పట్ల ఆసక్తిని కలిగించేలా కార్యక్రమాలు రూపొందించామన్నారు. జంతువుల వైద్యశాల సందర్శన, జంతు పరిరక్షకులతో ప్రత్యేక చర్యలు, పక్షులను వీకించడం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. తొలి రోజున జంతువులు థీమ్ ఉన్న టీ షర్టులు, టోపీలను జంతుల వుల బ్యాడ్జీలు, సీడ్ పెన్ సీడ్ పెన్సిళ్లను విద్యా వనరుల సామాగ్రిని అందించారు.



క్యాంపులో విద్యార్థులతో జూ క్యూరేటర్ మంగమ్మ

## జీవీఎంసీకి వెంటనే కమిషనర్‌ను నియమించండి

మంత్రి నారాయణకు కార్పొరేటర్ మూర్తి యాదవ్ వినతి



రాష్ట్రపురపాలక శాఖమంత్రి పి.నారాయణకు వినతపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీకి కమిషనర్‌ను వెంటనే నియమించాలని, వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన అక్రమ టీడీఆర్‌లు రద్దు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖమంత్రి పి.నారాయణను జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కోరారు.విశాఖ నగరాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించేందుకు బుధవారం నగరానికి విచ్చేసిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని మూర్తి యాద్ కలిసి ఒక వినతపత్రం అందజేశారు. రాష్ట్రంలో అతి పెద్ద కార్పొరేషన్‌గా ఉన్న జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్ నియమించాల్సిన అవసరం ఉందని, బహుళ విధులు నిర్వహించాల్సిన కమిషనర్ లేకపోవడం వల్ల పరిపాలనలో కొన్నిఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

## సుకుమారన్ మృతి సీపీఐకి తీరని లోటు

» పార్టీ నేతల నివాళి



సుకుమారన్ పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు

వెంకోజీపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ నగర మాజీ కార్యవర్గ సభ్యుడు, ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో-ఆపరేటివ్ అండ్ ఫ్రెండ్షిప్ (ఇస్కఫ్) జాతీయ నాయకుడు, విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ టీఎస్ సుకుమారన్(76) మంగళవారం రాత్రి అనారోగ్యంతో ఎంవీపీకాలనీలోని స్వగృహంలో మరణించారు. సుకుమారన్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మరపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్కే. రెహ్మాన్, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు సీహెచ్ రాఘవేంద్రరావు పేర్కొన్నారు. వారు బుధవారం ఉదయం ఎంవీపీ కాలనీలోని సుకుమారన్ మృతదేహానికి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా కేరళ నుంచి విశాఖ వచ్చిన సుకుమారన్ పార్టీ పట్ల సహకార ఉద్యమం పట్ల ఇస్కఫ్ పట్ల నిబద్ధత, నిజాయితీతో పనిచేసి మన్ననలు పొందిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. సుకుమారన్‌కు భార్య వినోలియా, ఇద్దరు కుమారులు ప్రవీణ్, ప్రదీప్ ఉన్నారు సుకుమారన్‌కు నివాళి అర్పించిన వారిలో అఖిల భారత ప్రొగ్రెసివ్ ఫోరం అధ్యక్షుడు ఆచార్య కె.ఎస్.చలం, సీపీఐ, బీఎస్ఎన్ఎల్, ఇస్కఫ్, విరసం నాయకులు కె.సత్యనారాయణ, సీఎన్ క్షేత్రపాత్, డి.మార్కండేయులు, బి.వెంకటరావు, ఎం.డి. బేగం, సీహెచ్ కాసుబాబు పలువురు స్నేహితులు, శ్రేయోభిలాషులు ఉన్నారు.

## పాఠశాలల విద్యా పునర్వ్యవస్థీకరణను నిలిపివేయాలి

» అఖిల భారత డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ డిమాండ్

వెంకోజీపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : సామాన్య, పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే పాఠశాల పునర్వ్యవస్థీకరణ విధానాన్ని అఖిల భారత డెమొక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఎయిడ్సో) తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఎయిడ్సో రాష్ట్ర కార్యదర్శి ఇ.మహేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి నూతన విద్యా ప్రణాళిక అమలుకు నడుము కట్టిందని, ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఎక్కడైనా నూతన ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభిస్తామని గాని, ప్రభుత్వ పాఠశాల విద్యను పరిరక్షించడం కోసం బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయిస్తామని గాని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని గాని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల పోస్టులను నియమిస్తామని గాని కూటమి ప్రభుత్వం చెప్పకపోవడం అన్యాయమన్నారు. గతంలో విలీనమైన పాఠశాలలను పునర్ ప్రారంభిస్తున్నట్టు సర్క్యులర్లను జారీ చేయలేదని, ఒక వైపు జీవో నెంబరు 117 రద్దు చేస్తామని చెబుతూనే, మరోవైపు జీవో నెంబరు 19, జీవో నెంబరు 21లను కూటమి ప్రభుత్వం తీసుకొని రావడం దుర్మార్గమన్నారు. విద్యలో మార్పులకు సంబంధించి విద్యావేత్తలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో ప్రభుత్వం చర్చించి మార్పులు చేపట్టాలని ఎయిడ్సో రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తోందని ఆ ప్రకటనలో ఎయిడ్సో విశాఖ జిల్లా అధ్యక్షులు కె.అభిలాష్ కోరారు.



పిఠాపురంకాలనీ కాయగూరల బజార్ వద్ద బహిరంగంగానే మద్యం తాగుతున్న మందుబాబులు

## పిఠాపురం కాలనీలో పట్టపగలే.. నడిరోడ్డుపై మందుబాబుల హల్‌చల్

» భయాందోళనలకు గురవుతున్న స్థానికులు

» పట్టించుకోని పోలీసులు

» మద్యం దుకాణాలపై అధికారుల నియంత్రణ కరువు

మద్దిలపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులోని బహిరంగ ప్రదేశాల్లో మందు బాబులు యథేచ్ఛంగా మద్యపానం సేవిస్తున్నారు. పట్టపగలే రోడ్డు మీద మద్యం బాటిళ్లతో తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నారు. వైన్స్ షాప్‌లలో పర్మిట్ రూంలు, బార్లు ఉన్నా కొందరు జనసంచారం ఉన్న ప్రాంతాల్లో మద్యం తాగుతూ మత్తులో హల్‌చల్ చేస్తున్నారు. బుధవారం పిఠాపురం కాలనీ రైతుబజార్ వద్ద గుంపుగా మందుబాబులు మద్యం సేవించారు. బీరు బాటిళ్లను తాగుతూ కొంత మంది, మరికొందరు గ్లాసుల్లో మద్యం సేవిస్తూ స్థానికులను హడలెత్తించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు బజార్ వద్దే బార్‌ను తలపించేలా గ్లాసుల్లో మద్యం సేవించి హల్‌చల్ చేశారు. కాయగూరల కోసం బజార్‌కు వచ్చిన కొనుగోలుదారులు.. బరితెగించిన మందుబాబులను చూసి భయాందోళనలకు గురయ్యారు. ఇలాంటి వారిపై పోలీసులు నిఘా లేకపోవడం, మద్యం దుకాణాల నిర్వహణపై అధికారుల నియంత్రణ కరువవడం వల్ల ఇలాంటివి ఇక్కడ నిత్యకృత్యమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీంతో పట్టపగలే ఈ ప్రాంతం మందుబాబుల అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొందరు మందుబాబులు నడిరోడ్డుపై మద్యం బాటిళ్లు ప్రదర్శిస్తూ నడుచుకుంటూ వెళ్లడం గమనార్హం. బహిరంగ ప్రదేశాల్లో మద్యంపానం చేయకూడదనే పర్మిట్ రూంలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ మందు బాబులు బహిరంగ ప్రాంతాల్లోనే మద్యం సేవిస్తు ప్రజలకు భయపెడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పారిశుధ్య కార్మికులకు నూనె, సబ్బులు పంపిణీ



పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె అందిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, టీడీపీ నేత కెల్ల సత్యనారాయణ తదితరులు

ఆరిలోవ, మే 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డు పారిశుధ్య కార్మికులకు ఆరిలోవ అన్న క్యాంటీన్ సమీపంలో గల వార్డు కార్యాలయంలో బుధవారం కొబ్బరినూనె, సబ్బులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కెల్ల సత్యనారాయణ, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు ధర్మారావు, కార్యదర్శి సురేష్, మహిళా అధ్యక్షురాలుమజ్జి రమణి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

వెంకోజీపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవనంలోని మహిళా సిబ్బందికి నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు ఏయూ రిజిస్ట్రా ఈఎన్ ధనుంజయరావు బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీల్లో 31 మంది మహిళా సిబ్బంది పాల్గొన్నారు. పోటీలు విజేతగా డబుల్స్ విభాగంలో డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.మంజుల, రమాదుర్గ జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో ఎన్.సునీత, వై.శివకుమారి, పి.దీపిక జట్టు, తృతీయ స్థానంలో సీహెచ్ జ్యోతికుమారి, మమత జట్టు నిలిచింది. ఈ సందర్భంగా విజేతలను రిజిస్ట్రార్ ధనుంజయరావు అభినందించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ అధికారి వి.సూర్యారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ పి.సాంబమూర్తి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.రామచంద్రరావు పాల్గొన్నారు.

## వైసీపీలో యాదవులకు సముచిత స్థానం

» పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు




సమావేశంలో మాట్లాడుతున్న పల్లా దుర్గారావు, గోవింద్, చందు తదితరులు

మద్దిలపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీలో యాదవులకు సముచిత స్థానం కల్పిస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు అన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ 2019 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో యాదవులకు ఒక ఎమ్మెల్యే టికెట్ కేటాయించిందన్నారు. 2020 జీవీఎంసీ ఎన్నికల్లో యాదవ సామాజికవర్గానికి 16 కార్పొరేటర్ టికెట్లు ఇవ్వడమే కాకుండా యాదవ మహిళకు మేయర్ చేసిన ఘనత వైసీపీదేనని గుర్తు చేశారు. వుడా చైర్మన్ కూడా యాదవులకు పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం అవకాశం కల్పించారన్నారు. అలాగే నామినేటెడ్ పోస్టుల్లో సైతం యాదవులకు సముచిత స్థానం కల్పించారన్నారు. తాజాగా తూర్పు నియోజకవర్గం సమన్వయకర్తగా యాదవ సామాజిక వర్గానికి మొల్లి అప్పారావును నియమించడంపై యాదవ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైసీపీ నేతలు పీతల గోవింద్,ఉరుకూటి చందు, పీతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రైళ్ల రీ షెడ్యూల్

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక కారణాలతో బుధవారం మరికొన్ని రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో ఆలస్యంగా నడిచాయి. సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరాల్సిన విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (58532) రాత్రి 9.15 గంటలకు, మధ్యాహ్నం 3.35 గంటలకు బయలుదేరాల్సిన విశాఖ-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (22854) అర్ధరాత్రి 12 (తెల్లవారితే 22వ తేదీ), గురువారం ఉదయం 8.25 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) ఉదయం 10.40 గంటలకు, ఉదయం 10.40 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-ఎస్ఎంవీ బెంగళూరు దురంతో ఎక్స్‌ప్రెస్ (12245) మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశారు.

# అప్పన్న ఆలయ అర్చకుడు వెంకట రమణాచార్యులు శివైక్యం


వెంకట రమణాచార్యులు

సింహాచలం, మే 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి సుమారు మూడున్నర దశాబ్దాల పాటు పలు కైంకర్యాల్లో పాల్గొన్న ప్రధాన అర్చకుడు (2) ఇరగవరపు వెంకట రమణాచార్యులు (58) బుధవారం గుండెపోటుతో శివైక్యం చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. అడివివరం గ్రామంలో జన్మించిన రమణాచార్యులు సింహాచలం దేవస్థానానికి చెందిన ఆగమ పాఠశాలలో ఆగమ శాస్త్రాన్ని అధ్యయనం చేశారు. 1992లో సింహాచలం దేవస్థానంలో నాలాయిర అధ్యాపకుడిగా తొలిసారి విధుల్లో చేరారు. తరువాత అర్చక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 1994లో అర్చకుడిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ముఖ్య అర్చక, ఉప ప్రధానార్చకుడిగా పని చేసి 2020లో ప్రధానార్చకుడిగా పదోన్నతి పొందారు. నాటి నుంచి స్వామివారికి జరుగుతున్న నిత్య, పక్ష, మాస, వార్షిక ఉత్సవాల్లో తమ సేవలను అందజేస్తున్నారు. వివాదరహితుడుగా, సౌమ్యుడుగా పేరు పొందారు. రెండు రోజుల క్రితం గుండెలో నొప్పిగా ఉందని ఆసుపత్రిలో చేరగా వైద్యులు పరీక్షించి, చికిత్స అందజేశారు. మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. రమణాచార్యునికి భార్య రాజ్యలక్ష్మి, కుమార్తె ప్రసన్న, కుమారుడు గోపీకృష్ణ ఉన్నారు. ఆయన మృతి పట్ల వైదిక సిబ్బంది, ఏఈఓలు, అడివివరం గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు సంతాపం తెలియజేశారు.







# ప్రపంచ రికార్డు లక్ష్యంగా యోగా సాధన

**జూన్ 21న రెండు లక్షల మందితో సాధన**

- యోగా దినోత్సవానికి ప్రధాని రాక
- జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
- బీచ్ రోడ్డులో అట్టహాసంగా యోగాంధ్ర వేడుకలు ప్రారంభం


బీచ్‌రోడ్డులో సామూహికంగా యోగాసనాలు వేయిస్తున్న శిక్షకులు

ధ్యాన ముద్రలో...


**బీచ్ రోడ్డు, మే 21 (ఆంధ్రజ్యోతి):** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ రికార్డు లక్ష్యంగా 2 లక్షల మందితో జూన్ 21న విశాఖ జిల్లాలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. జిల్లావ్యాప్తంగా యోగా మాసోత్సవం పాటించేందుకు సాధనకు ఏర్పాట్లు చేశామన్నారు. యోగా శిక్షకులు, సంఘాలు, నిపుణులను భాగస్వాములను చేయాలన్నారు. యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్‌ను థీమ్‌గా ప్రభుత్వం తీసుకున్నందున ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్నారు. యోగాంధ్రపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా ప్రతినిధులు పాలుపంచుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ యోగా సాధనతో ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు. అనంతరం చేపట్టిన సామూహిక యోగా సాధనలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఎమ్మెల్యే గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్.భవాని శంకర్, ఆయుష్ జిల్లా, క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, యోగా శిక్షకులు, అధికారులు పాల్గొన్నారు.


యోగాసనంలో ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ తదితరులు


ప్రాణాయామం చేస్తున్న సాధకులు


మేయర్ శ్రీనివాసరావు

# చల్లబడిన వాతావరణం

నగరంలో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం ఉదయం పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా, ఏకధాటిగా కురిసిన వర్షంతో పలు రహదారులు జలమయమయ్యాయి. బుధవారంసాయంత్రం కూడా మేఘాలు దట్టంగా ఆవరించి ఉన్నాయి. బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా కురిసిన వర్షానికి బాటసారులు తడిసి ముద్దయ్యారు. కొందరు ముందు జాగ్రత్తగా గడుగులు తెచ్చుకున్నా కుండపోతగా కురిసిన వర్షానికి తడిసిపోయారు. రహదారులపై వాననీరు నిలిచిపోవడంతో వాహనదారులు నెమ్మదిగా లైట్లు వేసుకుని వెళ్లవలసి వచ్చింది. సిరిపురం జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, అక్కయ్యపాలెం, బీచ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వాననీరు మడుగులు కట్టింది. మరోవైపు ఆకాశం దట్టంగా మేఘాలు కమ్ముకుని ఉండడం, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నగరంలోని రహదారులపై పెద్దగా రద్దీ కనిపించలేదు. నిన్న, మొన్నటి వరకు తీవ్రమైన ఎండలకు అల్లాడిన ప్రజలు ప్రస్తుతం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం పొందినా, ఇళ్లలో ఉక్కబోత తగ్గలేదు. -ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం


సముద్రతీరంలో దట్టంగా కమ్ముకున్న మేఘాలు


సిరిపురం పెట్రోల్ బంక్ వద్ద వర్షంలో వాహనదారులు


లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళ్తున్న వాహనాలు


నగరంలో కొండ ప్రాంతంపై ఆవరించిన మేఘాలు

# విధి నిర్వహణలో ప్రతిభచూపిన పోలీసులకు రివార్డులు


పదోన్నతులు పొందిన పోలీసులతో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభచూపిన పోలీసులకు నగర పోలీస్‌కమిషనర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. పోలీస్‌కమిషనరేట్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 307 మందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. నగరంలో గంజాయి రవాణాకు అడ్డుకట్టవేయడం, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసులను ఛేదించడం, సైబర్‌క్రైమ్‌లో ఉత్తమ ప్రతిభచూపడం, చోరీ కేసులను ఛేదించడంలో ప్రతిభ చూపినందున వారి సేవలను గుర్తించడంతోపాటు మిగిలినవారిని ప్రోత్సహించేందుకు వీలుగా రివార్డులు అందజేస్తున్నట్టు సీపీ వివరించారు. రివార్డులు అందుకున్నవారిలో హోంగార్డు స్థాయి నుంచి సీఐ స్థాయి వరకు ఉన్నారు.

పోలీసులకు పదోన్నతి: పోలీస్‌కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఎనిమిది మందికి పదోన్నతి కల్పిస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతి పొందినవారికి స్వయంగా ఆయన బ్యాడ్జీలను దరించి, మరింతగా కష్టపడి విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా, ముగ్గురు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లగా, ఒక ఏఆర్ కానిస్టేబుల్‌కు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించారు.

# హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ శిక్ష

విశాఖ లీగల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : అత్యాశతో ఒక వ్యక్తిని హత్య చేసిన లారీ క్లీనర్‌కు యావజ్జీవ జైలు శిక్ష, రూ. పది వేల జరిమానా విధిస్తూ.. నగరంలోని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి సీకే గాయత్రి బుధవారం తీర్పు చెప్పారు. జిల్లా కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయవాడకు చెందిన పిండి నాగరాజు, పి. మల్లికార్జునరావు దగ్గర క్లీనర్‌గా పనిచేసేవాడు. మల్లికార్జునరావుకు సొంత లారీలున్నాయి. 2015 నవంబరు 15న మల్లికార్జునరావు విజయవాడలో లోడ్ ఎక్కించుకుని అక్కడి నుంచి కోల్‌కత్తా వెళ్లాడు. అక్కడ కాఫీ లోడు ఎక్కించుకుని విజయవాడ వైపు బయలుదేరాడు. 2015 నవంబరు 30న సాయంత్రం క్లీనర్‌గా ఉన్న నాగరాజు ఎలమంచిలి దగ్గర పుటుగా మద్యం సేవించాడు. డ్రైవర్ కమ్ ఓనర్ మల్లికార్జునరావు విశ్రాంతి తీసుకుంటుండగా అతన్ని బలమైన ఆయుధంతో అతి కిరాతకంగా హత్య చేశాడు. మృతదేహాన్ని సమీపంలోని పెద్ద కాలువలో పడేశాడు. లారీని విజయవాడకు తీసుకెళ్లి సరకు అందించి డబ్బు కాజేశాడు. తన తండ్రి కనిపించకపోవడంతో మల్లికార్జునరావు కుమారుడు చంద్రశేఖర్ ఎలమంచిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ జరపగా నాగరాజుని నిందితుడిగా గుర్తించారు. ఈమేరకు అతనిపై సెక్షన్ 302, 379 కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెల్లడించారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి

ఆనందపురం, మే 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమిలి క్రాస్ రోడ్డు వద్ద కారు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. నగరంలోని సీతంపేటకు చెందిన జి. నరసింగరావు (52) స్కూటీపై బుధవారం తగరపువలస పని మీద వచ్చాడు. తిరుగు ప్రయాణంలో భీమిలి క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొంది. దీంతో ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

ఎండాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో మరో ఇద్దరిని సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్న ఏ2 విజయనగరానికి చెందిన గండి గణేశ్, ఏ5 పల్లి రామకృష్ణ అలియాస్ హరీష్‌ను మధురవాడలో పట్టుకున్నారు. వారి నుంచి రెండు స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న అరెస్టు చేశారు.

**క్రైం... crime news**

## బాంబు పేలి బాలుడికి తీవ్రగాయాలు


గాయపడిన బాలుడు నవీన్

భీమునిపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): బాంబు పేలుడులో మంగమారిపేటకు చెందిన గరికిన నవీన్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. భీమిలి బీచ్‌రోడ్డులో వున్న ఆ గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామదేవత ఉత్సవాల్లో సముద్ర తీరంలో లంకాదహన కార్యక్రమాన్ని భారీఎత్తున నిర్వహించారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ఇంటివద్దే పిల్లలు ఉంటున్నారు. ఈనేపథ్యంలో లంకాదహనం జరిగిన ప్రదేశానికి కొందరు పిల్లలు వెళ్లి బాణసంచా కాల్పులలో పేలని వస్తువులను ఏరుకొని ఇళ్లకు తీసుకు వెళ్లినట్లు తెలిసింది. బుధవారం మధ్యాహ్నం మంగమారిపేటకు చెందిన నవీన్ బాంబును చితగ్గొట్టి అగ్గిపుల్ల వెలిగించాడు. ఆ బాంబు పేలడంతో ముఖం, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో కుటుంబికులు హుటాహుటిన భీమిలి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రుషికొండలో వున్న గీతం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

## రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.12,500 విలువ గల 2.5 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీ చేస్తున్న సమయంలో తెలంగాణకు చెందిన షేక్ సాహిల్ ((27) అనే యువకుడు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

## గంజాయితో ఇద్దరి అరెస్టు

- 2 కిలోల 300 గ్రాముల సరుకు స్వాధీనం
- నిందితులు రిమాండ్‌కు తరలింపు

ఆరిలోవ, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ వ్యాలీ స్కూలు సమీపంలో గంజాయి పట్టుకొని ఇద్దరు వస్తున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించి కొత్తవలస రాజీవ్ నగర్‌కు చెందిన ాకర సుభాష్‌చక్రవర్తి (21) అరకు ప్రాంతానికి చెందినమజ్జి అప్పన్న (55)ను ఆరిలోవ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రెండు కిలోల 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరు అరకు ప్రాంతం నుంచి గంజాయి తీసుకొస్తున్నట్టు చెప్పారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.